ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 25 నవంబరు 2024



రేపల్లె మండలం రుద్రవరంలో తుప్పు పట్టి అర్ధాంతరంగా తయారైన టిడ్కో భవన సముదాయం

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఇల్లు.. ఇస్తారా?

"పట్టణ పేదల ఇంటి కష్టాలను తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కోసం ఆధునిక టెక్నాలజీతో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. అప్పట్లోనే చాలావరకు నిర్మాణాలు పూర్తి చేసుకోగా.. కొన్ని దగ్గర్ల గృహ ప్రవేశాలు కూడా జరిగాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతోనే టిడ్కో పనులను నిలిపివేసింది. అంతకు ముందు పూర్తి అయిన ఇళ్లను కూడా పంపిణీ చేయలేదు. దీంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నా.. వైసీపీ పాలకులు తమకు ఇళ్లు పంపిణీ చేయాలని లబ్ధిదారులు ఆందోళనలు చేసినా ఎన్నికల ముందు వరకు స్పందించలేదు. ఎన్నికల సమయంలో హడావుడిగా పంపిణీ చేపట్టారు. అయితే కొన్నిదగ్గర్ల సక్రమంగా వసతులు కల్పించలేదు. మరికొన్ని దగ్గర్ల పనులు పూర్తిగా జరగలేదు. దీంతో చాలామందికి ఇంటి కాగితాలు చేతికి వచ్చినా ఇళ్లలో చేరలేదు. చేరినవారు అక్కడి సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. అయితే మళ్లీ టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో తమ ఇంటి కల నెరవేరుతుందని టిడ్కో లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు."

- కలగానే టిడ్కో గృహయోగం
- ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికలకు ముందు హడావుడిగా పంపిణీ
- సౌకర్యాలు లేక ఇళ్లలో లబ్ధిదారుల అవస్థలు

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

గత టీడీపీ ప్రభుత్వం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 33,264 మంది పట్టణ పేదల కోసం ఆయా మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. వీటిలో గత ప్రభుత్వం 25,228 గృహాల నిర్మాణాల్ని పూర్తి చేసింది. 8,036 గృహాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఆధునిక పరిజ్ఞానంతో పేదల కోసం నాటి ప్రభుత్వం ఇళ్లను నిర్మించింది. అద్దె ఇంటి కష్టాలు తప్పుతాయి.. సొంతింట్లో సంతోషంగా ఉండవచ్చని లబ్ధిదారులు ఆశిస్తున్న తరుణంలో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల పనులను నిలిపివేసింది. మౌళిక వసతుల పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించడంలో కాలయాపన చేసింది. ఇళ్లు ఇవ్వండి మహాప్రభో అని లబ్ధిదారులు వేడుకున్నా.. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ రంగులు వేయడంతో సరిపెట్టారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గత ఏడాది చివర్లో వైసీపీ ప్రభుత్వం హడావు డిగా కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఇళ్లను అందజేసింది. అయితే అక్కడ మౌలిక వసతులు, సౌకర్యాలు, సరైన రక్షణ చర్యలు లేవు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల ప్రాంగణాల్లోని సమస్యలు పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఇళ్లు ఇస్తే తమ అద్దెంటి కష్టాలు తీరుతాయని ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా కొన్ని మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్ల ప్రాంగణాల్లో మౌలిక వసతుల కల్పనపై ఇప్పటికీ అధికారులు మౌనంగానే ఉన్నారు. అక్కడ తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ, రోడ్లు తదితర మౌలిక వసతులు ఎప్పటికి కల్పిస్తారో.. తమకు ఎప్పటికి ఇళ్లు అందుతాయోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. అనేక ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లు బూజుపట్టగా, టిడ్కో ఇళ్ల ప్రాంగణాలు పిచ్చిచెట్లతో అడవులను తలపిస్తు న్నాయి. నిర్మాణంలో ఉన్న ప్రాంతాల్లో అయితే ఇనుప చువ్వలు తుప్పు పట్టిపోయాయి.

సౌకర్యాలు అంతంతే..

చిలకలూరిపేట: సరైన సౌకర్యాలు లేని కారణంగా చిలకలూరిపేటలోని టిడ్కో గృహాలలో 50 శాతం పైగా కుటుంబాలు నివాసానికి ఆసక్తి చూపడం లేదు. మొదటి దశలో నిర్మించిన 4,612 గృహాల్లో సుమారు 2 వేల మందే నివాసం ఉంటున్నారు. పట్టణానికి నాలుగున్నర కిలోమీటర్ల దూరంలోని చెరువు రోడ్డులోని టిడ్కో సముదాయానికి సరైన రవాణా సౌకర్యం లేదు. పాఠశాల, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్ కూడా అందుబాటులో లేదు. మురుగునీరు పారుదల వ్యవస్థ లేదు. ఇటీవల మంత్రి నారాయణ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు టిడ్కో సముదాయాన్ని సందర్శించగా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

ఎదురుచూపులు

అద్దంకి: వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి ఐదున్న రేళ్లుగా టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఎదురు చూపులే మిగిలాయి. అద్దంకిలో 863 ప్లాట్లతో శింగరకొండ సమీపంలో టిడ్కో అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు జరిగాయి. వైసీపీ అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్ల పనులను అర్ధాంతరంగా నిలిపివేసింది. దీంతో గత ఐదున్నరేళ్లుగా ఎలాంటి పనులు జరగలేదు. 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. నిలిచిపోయిన పనులను పూర్తి చేయడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు కసరత్తు ప్రారంభించారు. టిడ్కో ఇళ్ల వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ కూడా మంజూరు అయింది.



చిలకలూరిపేటలో నిర్మించిన టిడ్కో గృహాలు



అద్దంకిలో అర్ధాంతరంగా ఆగిపోయిన టిడ్కో గృహ సముదాయం

శిథిలావస్థ

రేపల్లె: గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాలను చేపట్టగా 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షకట్టి ఐదేళ్లుగా వాటిని శిథిలావస్థకు చేర్చింది. రూ.కోట్లతో నిర్మించిన టిట్కో గృహ సముదాయాలు ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో అడవులను తలపిస్తున్నాయి. రేపల్లె మండలం అరవపల్లి పంచాయతీ శివారు గుంటూరువారి ఎస్సీ కాలనీ సమీపంలో 11 ఎకరాల్లో టిడ్కో ఇళ్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి ఉన్నాయి.



రేపల్లె మండలం రుద్రవరం వద్ద నిలిచిపోయిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం భారీగా పెరిగిన పిచ్చి మొక్కలు

పంపిణీ ఎప్పటికో?

నరసరావుపేట: టీడీపీ హయాంలో 2018లో 1504 గృహాలను నరసరావుపేటలో నిర్మించారు. ఇళ్లు నిర్మించి.. వసతులు కల్పించి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. గృహాల పంపిణీపై అధికారులకే స్పష్టత లేదు. సొంత ఇంటి కోసం లబ్ధిదారులు ఏళ్లుగా ఎదురు చూస్తున్నా వీరి మొర ఆలకించే వారే కరువయ్యారు. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు చోటు చేసుకున్నాయని గతంలో 285 లబ్ధిదారుల పేర్లను తొలగించడంతో వారు కోర్టును ఆశ్రయించారు. ఈ పరిస్థితుల్లో పాత వారికే ఇళ్లు కేటాయించాలని కోర్టు మధ్యంతరం ఉత్తర్వులు ఇచ్చింది. అయినా సదరు పేదలకు ఇళ్లను కేటాయించే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. వాటా ధనం చెల్లించిన 580 మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపుపై సందిగ్ధత నెలకొంది. ప్రస్తుతం 82 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. మిగిలిన ఇళ్లు ఏళ్లుగా పంపిణీ జరగక పోవడంతో పాడుబడే పరిస్థితులు నెలకొనున్నాయి.



నరసరావుపేటలో పంపిణీకి నోచుకోని టిడ్కో గృహాలు

సౌకర్యాలు నాస్తి..

గుంటూరు: ఏళ్లుగా గుంటూరులోని పట్టణ పేదలు సొంత ఇంటి కల నేరవేడంలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అడవితక్కెళ్లపాడులో 4750 టిడ్కో గృహాలు మంజూరు కాగా అప్పట్లోనే 1100 ఇళ్లను నిర్మించారు. ఇంటి కోసం అప్పు చేసి చెల్లించిన వాటా ధనానికి వడ్డీ ఒకవైపు.. ఉంటున్న ఇళ్లకు అద్దెలు చెల్లించలేక మరోవైపు భారం పడుతుందని లబ్ధిదారులు వాపోతున్నా ఇంతకాలం పాలకులు ఆలకించ లేదు. పార్టీ రంగులు వేయడంలో చూపిన శ్రద్ధ పనులు పూర్తి చేయడంలో, వసతులు కల్పించడంలో జగన్ ప్రభుత్వం చూపలేదు. ఎన్నికలకు ముందు పంపిణీ చేసిన ఇళ్లలో నివాసాలకు సరైన సౌకర్యాలు లేక లబ్ధిదారులు ఇక్కట్లు పడుతున్నారు. కొన్ని ఇళ్లకు కిటికీలు, తలుపులు దెబ్బతినిపో వడం, భూగర్భ విద్యుత్ తీగలు కాలిపోయి, ప్రమాదకరంగా మారడం వంటి ఇబ్బందులతో లబ్ధిదారులు గృహప్రవేశాలకు సాహసం చేయలేదు.



అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహాలు



- ఏపీకి కలిసిరానున్న చంద్రబాబు అనుభవం, పవన్ ఆవేశం
- కూటమి ప్రభుత్వ ఏర్పాటు రాష్ట్రానికి సువర్ణావకాశం
- నరసరావుపేటలో విజయనిర్మల విగ్రహ ప్రతిష్ఠ నా కల
- కళాకారులను ప్రోత్సహించేందుకు నంది అవార్డులు ఇవ్వాలి
- చిత్రం భళారే విచిత్రం, శ్రీవారికి ప్రేమలేఖ పార్ట్ -2లకు ప్లాన్
- ఆంధ్రజ్యోతితో సినీనటుడు నరేష్

పదేళ్లలో ప్రథమస్థానం

ఆంధ్రజ్యోతితో అతిథి

నరసరావుపేట కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అనుభవం.. పవన్‌కల్యాణ్ ఆవేశం కలగలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పదేళ్లలో ప్రథమ స్థానానికి చేరుకుంటుంది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాజధాని అమరావతి శిథిలావస్థకు చేరింది. ప్రధాని మోదీ ప్రోత్సాహం, చంద్రబాబు సామర్థ్యంతో అమరావతి పునర్నిర్మాణం జరగడం తథ్యం. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం రాష్ట్రానికి సువర్ణావకాశం.. అని సినీనటుడు నరేష్ తెలిపారు. స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ఆదివారం ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. సినీ ప్రస్థానం నుంచి రాజకీయాల వరకు ఆయన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

● సినీ ప్రస్థానం

నా పదో ఏట పండంటి కాపురం సినిమాతో అరంగేట్రం చేశాను. అది మొదలు ఇప్పటివరకు నటిస్తూనే ఉన్నాను. నటప్రస్థానం 50 యేళ్లు పూర్తిచేసుకుంది. ఇప్పుడు హీరోగా రెండు మూడు సినిమాలు చేస్తూ హైసక్సెస్ రేట్‌లో ఉన్నాను. క్యారెక్టర్ ఆర్టిస్టుగా కొన్ని సినిమాలు చేస్తున్నాను. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో యునైటెడ్ నేషన్స్ అంబాసిడర్‌గా ఉన్నాను. గతంలో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సినీ ఇండస్ట్రీ కోసం, కళాకారులకోసం కృషి చేశాను.

● నరసరావుపేటతో అనుబంధం

నరసరావుపేట మా అమ్మవాళ్ల ఊరు. చిన్నప్పుడు వేసవి సెలవుల్లో ఇక్కడికి వచ్చేవాణ్ని. ఇక్కడ మా బంధువులు చాలామంది ఉన్నారు. కొంతకాలంగా ఈ ఊరితో అనుబంధం తెగిపోయింది. అనుకోకుండా ఈ కార్యక్రమంతో మళ్లీ ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది. అమ్మ భారతదేశం గర్వించదగ్గ నటిమణి. 46 సినిమాలకు దర్శకత్వం వహించింది. గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న మహిళా దర్శకురాలు. అమ్మకు పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులు రాకపోవడం వెలితిగా అన్పిస్తుంది. తను పెరిగిన నరసరావుపేటలో విగ్రహం పెట్టాలి అనగానే స్థానిక ఎమ్మెల్యే సహకరిస్తానని సభాముఖంగా చెప్పడం సంతోషం. కాపు సంఘం ద్వారా త్వరలో మంచి ప్రదేశం చూసి అమ్మ విగ్రహం ఏర్పాటు చేయించడం జరుగుతుంది. ఇక్కడ అమ్మ విగ్రహం ప్రతిష్ఠించడం నా కల. సహకారం ఇస్తానన్నందుకు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు.

● రాష్ట్రం ఇక సుభిక్షం

ప్రజలందరూ కోరుకున్న రాజధాని అమరావతి పునర్నిర్మాణం జరుగుతుంది. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం సుభీక్షంగా మారుతుంది. కేంద్రంలో ప్రధాని మోదీ సహాయ సహకారాలు, చంద్రబాబు సమర్థతతో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకెళ్తుంది.

● షూటింగులకి రాయితీలు ఇవ్వాలి

రాష్ట్రంలో సినిమా షూటింగులకు ఎన్నో అనువైన లొకేషన్లు ఉన్నాయి. ఇక్కడ షూటింగులు జరుపుకోవడానికి ప్రభుత్వం రాయితీలు ఇవ్వాలి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి కాబట్టి సినిమా పరిశ్రమకు, కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుందన్న ఆశాభావం ఉంది. కళాకారులకు ప్రోత్సాహం ఇచ్చేలా నంది అవార్డులు ఇవ్వాలి. నంది అవార్డులు ఇవ్వడం అనేది దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీ. దీనిని మళ్లీ పునరుద్ధరించాలి. ఓటీటీలు రావడంతో థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకమైంది. ఇది బాధ కలిగించే విషయమైనా, టెక్నాలజీతో వచ్చే మార్పులతో నడవాలి. చిత్రం భళారే విచిత్రం పార్ట్ 2 స్క్రిప్ట్ వర్క్ జరుగుతుంది. శ్రీవారికి ప్రేమలేఖ పార్ట్ 2 తీయడానికి ప్లాన్ చేస్తున్నాను.

మెయిన్ కెనాల్‌పై కూలిన సర్‌ప్లస్

రేపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు అందించేందుకు బ్రిటీష్ వారు 1916లో వెల్లటూరు మెయిన్‌చానల్‌పై వెల్లటూరు-భట్టిప్రోలు మధ్య నిర్మించిన సర్‌ప్లస్ లాకులు ఆదివారం కూలిపోయాయి. దీంతో కాల్వలో ఉన్న సాగు నీరంతా వృథాగా పోయింది. భట్టిప్రోలు, చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాలకు సాగునీరు నిలిచిపోయింది. 112 సంవత్సరాల క్రితం నిర్మించిన మెయిన్ కెనాల్ ద్వారానే రైతులకు సాగునీరు అందుతుంది. కాలం చెల్లిపోవడంతో సర్‌ప్లస్ లాకులు కూలిపోయినట్లు రైతులు తెలిపారు. 24 కిలోమీటర్లు మేర పొడవు ఉన్న ఈ కాల్వ పరిధిలో 31,670 ఎకరాలకు సాగునీరు అందుతుంది. వెల్లటూరు-భట్టిప్రోలు మధ్య లాకులు కూలడంతో వెల్లటూరులోని మెయిన్ కెనాల్ నుంచి వచ్చే సాగునీటిని కట్టేశారు. సర్‌ప్లస్ లాకులు నిర్మించేంత వరకు నీరు వదిలే పరిస్థితి లేదు. ఖరీఫ్ సీజన్ ముగుస్తుండంతో రైతులు రెండో పంట కింద మినుము, పెసలు, మొక్కజొన్న తదితర పంటలు వేసేందుకు విత్తనాలు చల్లుకుంటున్నారు. సాగునీరు రావాలంటే లాకుల నిర్మాణం చెయ్యాల్సి ఉంది. నీటిపారుదల శాఖాధికారులు దృష్టిసారించి సత్వరమే లాకులు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

మూడు మండలాలకు నిలిచిన సాగునీరు

1916లో బ్రిటిష్ కాలంలో లాకుల నిర్మాణం





వెల్లటూరు-భట్టిప్రోలు మధ్య మెయిన్‌కెనాల్‌పై కూలిన సర్‌ప్లస్ (ఇన్‌సెట్లో) వృథాగాపోతున్న నీరు

క్వింటాల్‌కు రూ.20 వసూలు

- పత్తి రైతులను పీడిస్తోన్న సిబ్బంది
- ఇవ్వకపోతే వేలిముద్రలు వేయని వైనం
- సీసీఐ కేంద్రాల్లో వసూళ్లపై రైతుల ఆగ్రహం



సీసీఐ కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన పత్తి నిల్వలు

గుంటూరు సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు.. తేమ శాతం.. రవాణా.. నిరీక్షణలతోనే ఇబ్బంది పడుతున్న పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లో సిబ్బంది తీరుతో దోపిడీకి గురవుతున్నారు. పత్తి పండించి దానిని విక్రయంచడానికి రైతులు నరకం చూస్తున్నారు. ఏదో ఒక రూపంలో పత్తి రైతులకు వేధింపులు ఎదురౌతూనే ఉన్నాయి. కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే పత్తికి క్వింటాల్‌కు రూ.20 ముడుపులు రూపేణా చెల్లించాల్సిందేనని కొందరు సిబ్బంది తెగేసి చెబుతున్నారు. అడిగినంత ఇవ్వకపోతే పత్తిని దిగుమతి కాకుండా అడ్డుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. కొనుగోలు వ్యవహారంలో ఉన్నత స్థాయి వ్యక్తులు రంగ ప్రవేశం చేసినా సీసీఐ కేంద్రాల్లో ఎదురౌతున్న అనుభవం చూసి రైతులు ఖంగు తింటున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో ఎక్కువ భాగం ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా సీసీఐ కేంద్రాలు కూడా గుంటూరులోనే ఏర్పాటు చేశారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 వారీగా విభజించిన మీదట సుమారు 32 కేంద్రాల వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్నాయి. రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న పత్తిని అమ్మకం కోసం ఆయా కేంద్రాలకు తీసుకురావాల్సి వస్తుంది. రైతులు ఎంత మొత్తంలో అయితే కేంద్రానికి పత్తి తీసుకువస్తారో ఆ వివరాలు సీఎం యాప్‌లో కూడా నమోదు చేయాలి. అందుకోసం ప్రభుత్వం సీసీఐ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సిబ్బంది, బయ్యర్లు వేలిముద్రలు వేయాలి. ఒక వేళ వేలిముద్ర లు వేయకపోతే సదరు వివరాలు సీఎం యాప్‌లో అప్‌లోడ్ అవ్వవు. వివరాలు అప్‌లోడ్ కాకపోతే పత్తి కొనుగోళ్లు జరగవు. ఈ పరిస్థితుల్లో కేంద్రాల్లో సిబ్బందికి ముందే రైతులు కప్పం కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు డిమాండ్ చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇవ్వకపోతే వేలి ముద్రలు వేయమని సిబ్బంది ముందే చెబుతున్నట్లు వాపోయారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సిబ్బందికి సీసీఐ బయ్యర్లు కూడా అనధికారికంగా 2 నుంచి 3 శాతం వరకు చెల్లించే పద్ధతి అమల్లో ఉన్నట్లు సమాచారం. అది చాలక రైతుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడటం వివాదాస్పదమవుతుంది. సీసీఐ కేంద్రాల ఏర్పాటు రైతులకు ఏమో గానీ కొందరికి మాత్రం మంచి లాభదాయకంగా ఉంది.

మెగా జాబ్‌మేళాలో మెరుగైన ఉద్యోగాలు

● రాష్ట్ర వ్యాప్తంగా 11,500 మంది హాజరు

7



అక్రమ వ్యాపారాలను అరికట్టేదెలా?

● జీరో బిజినెస్‌పైనే మిర్చి స్థానిక లావాదేవీలు

● ఎక్కువగా కారం మిల్లులకు అమ్మకాలు

● ఐదుశాతం జీఎస్‌టీని ఎగ్గొట్టేందుకే ఈ వ్యవహారం

ఆశ్రం కళాశాలలో పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య

నరసరావుపేటలో డాక్టర్ ఇంట విషాదం

సూర్యలంక తీరం.. జనసంద్రం

● పోటెత్తిన లక్షమందికిపైగా పర్యటకులు

నాణ్యమైన కరెంటు

సరఫరా చేయాలి

- కొత్త సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు భూసేకరణ
- విద్యుత్ సమీక్షలో మంత్రి రవికుమార్ ఆదేశాలు
- నిర్లక్ష్య వైఖరి వీడి పర్యవేక్షణ చేయాలని సూచన

అద్దంకి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్ సరఫరాకు ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా చేపట్టిన త్రీఫేస్ లైన్ల ఏర్పాటు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యలపై ఆదివారం చిలకలూరిపేటలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నదన్నారు. కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించి రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ వినియోగం, అవసరాన్ని బట్టి కొత్త సబ్‌స్టేషన్ల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. అద్దంకి పట్టణం, మేదరమెట్లలో కొత్తలైన్ల ఆధునీకరణ పనులను పూర్తి చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, మార్టూరు డీఈఈ సురేంద్రబాబు, ఏఈలు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

బీమా సుగమ్ కోసం రూ.500 కోట్లు

ముంబై: భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) తలపెట్టిన 'బీమా సుగమ్' ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బీమా మంథన్ సదస్సులో బీమా కంపెనీలు ఈ అంచనాకు వచ్చినట్టు సమాచారం. అన్ని రకాల బీమా పాలసీల మార్కెటింగ్, ఇతర సేవలు ఒకే చోట అందించేందుకు ఐఆర్‌డీఏఐ ఈ సింగిల్ విండో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను తలపెట్టింది. ఇందుకు రూ.100 నుంచి రూ.200 కోట్లు ఖర్చవుతుందని మొదట్లో అంచనా వేశారు. తాజా అంచనాల ప్రకారం ఇందుకు ఎంతలేదన్నా రూ.500 కోట్లు ఖర్చవుతుందని కంపెనీలు ఒక అంచనాకు వచ్చాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రారంభానికల్లా దీన్ని అమలు చేయాలని ఐఆర్‌డీఏఐ యోచిస్తోంది.

దీన్ దయాళ్ క్షేత్రంలో అరకొర ఉత్పత్తితో

ఓఎన్‌జీసీకి తిప్పలు



రోజుకు కేవలం 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ గ్యాస్ ఉత్పత్తి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ తీరంలోని కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లో ఉన్న దీన్ దయాళ్ సహజ వాయువు క్షేత్రం.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి పెద్ద గుదిబండలా మారింది. భారీ గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయనే పేరుతో గుజరాత్ ప్రభుత్వ రంగ సంస్థ గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (జీఎస్‌పీసీఎల్) ఈ గ్యాస్ ఫీల్డ్‌ను 2017 జూలైలో ఓఎన్‌జీసీకి అంటగట్టింది. అంతకు ముందే జీఎస్‌పీసీ ఈ సహజ వాయు క్షేత్రంలో తనకున్న 80 శాతం వాటాలో 50 శాతం ఇస్తానన్నా ఓఎన్‌జీసీ తిరస్కరించింది. అయితే 2017కు వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. దీన్ దయాళ్ ఫీల్డ్ ఈక్విటీలో తనకున్న మొత్తం 80 శాతం వాటాను జీఎస్‌పీసీ.. ఓఎన్‌జీసీకి రూ.7,738 కోట్లకు విక్రయించింది.

అంతా 'గ్యాసే'

జీఎస్‌పీసీఎల్ ఈ గ్యాస్ ఫీల్డ్‌లో 20 లక్షల కోట్ల ఘనపుటడుగుల (టీసీఎఫ్) గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు, దీన్నుంచి రోజూ 20 కోట్ల ప్రామాణిక ఘనపుటడుగుల (ఎంఎస్‌సీఎఫ్‌పీడీ) గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని మొదట్లో గ్యాస్ కొట్టింది. ఓఎన్‌జీసీకి తన 80 శాతం వాటా అమ్మే నాటికే జీఎస్‌పీసీ ఈ క్షేత్రంలో మూడు గ్యాస్ బావులు తవ్వింది. ఓఎన్‌జీసీ చేతికి వచ్చాక మరో ఏడు బావులు తవ్వారు. సాంకేతిక సమస్యలతో ఇందులో మూడు బావుల డ్రిల్లింగ్ మధ్యలోనే ఆపేశారు. పూర్తి చేసిన మిగతా నాలుగు బావుల్లోనూ రోజువారీ గ్యాస్ ఉత్పత్తి 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ మించడం లేదు.

ఖర్చు బారెడు

తన చేతికి వచ్చాక ఓఎన్‌జీసీ.. దీన్ దయాళ్ క్షేత్రం ఫీల్డ్ అభివృద్ధి కోసం పెద్ద మొత్తమే ఖర్చు చేసింది. ఈ కొనుగోలుతో జీఎస్‌పీసీఎల్ మాత్రం తన అప్పుల భారం కుదించుకుంది. ఓఎన్‌జీసీ మాత్రం తన మిగులు నిధుల్లో ఎక్కువ భాగం ఇందుకోసం ఖర్చు చేయాల్సి వచ్చింది. మంచి ఆర్థిక స్థోమత, టెక్నాలజీ ఉన్న ఏదైనా సంస్థ ముందుకు వస్తే భాగస్వామ్యంతో దీన్ దయాళ్ గ్యాస్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేయాలని ఓఎన్‌జీసీ చూస్తోంది. అందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఈ గ్యాస్ ఫీల్డ్ ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీకి పెద్ద భారంగా మారింది.

24,300 పైన బుల్లిష్

(నవంబరు 25-29 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అస్ట్రో గైడ్

నిఫ్టీ గత వారం 24,956-23,263 పాయింట్ల మధ్యన కదలాడి 375 పాయింట్ల లాభంతో 23,907 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,562, 23,644, 23,909, 24,482 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,300 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,400
నిరోధ స్థాయిలు: 24,100, 24,200, 23,400 (24,000 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,700, 23,500, 23,400 (23,800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	595
వరంగల్	582	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	108
వరంగల్	107	గుంటూరు	103
కరీంనగర్	107	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	75
కర్నూలు	107	నెల్లూరు	75
విశాఖపట్నం	120	అనంతపురం	75
గోదావరి	108		

హీరో, జీరో భాగస్వామ్యంలో కొత్త ఈ-బైక్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన జీరో మోటార్ సైకిల్స్ భాగస్వామ్యంలో హీరో మోటో కార్ప్ రూపొందిస్తున్న మిడ్ పెర్ఫార్మెన్స్ విద్యుత్ బైక్ అభివృద్ధి అడ్వాన్స్‌డ్ దశలో ఉన్నదని చెబుతున్నారు. ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీలో పేరెన్నిక గన్న కాలిఫోర్నియాకు చెందిన జీరో మోటార్ సైకిల్స్ 6 కోట్ల డాలర్ల ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు హీరో మోటో కార్ప్ డైరెక్టర్ల బోర్డు 2022 సెప్టెంబరులో ఆమోదించింది. తమ భాగస్వామ్యంలో ప్రీమియం విద్యుత్ బైక్‌లు రూపొందిస్తామని 2023లో రెండు కంపెనీలు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యంలో మిడ్ పెర్ఫార్మెన్స్ ఈ- బైక్ అభివృద్ధి దశలో ఉన్నదని హీరో మోటో కార్ప్ సీఈఓ నిరంజన్ గుప్తా తెలిపారు.

డిసెంబరులోనూ ఐపీఓల జోరు

10 ఇష్యూలు.. రూ.20,000 కోట్ల సమీకరణ !

నూఢిల్లీ: సెకండరీ మార్కెట్ ఆటుపోట్లలో ఉన్నా, ప్రైమరీ మార్కెట్ జోరు తగ్గడం లేదు. వచ్చే నెల కూడా 10 కంపెనీలు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల ద్వారా రూ.20,000 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో సూపర్ మార్కెట్ చెయిన్ విశాల్ మెగా మార్ట్, బ్లాక్‌స్టోన్ నిర్వహణలోని డైమండ్ గ్రేడింగ్ కంపెనీ ఇంటర్నేషనల్ జెమ్మోలాజికల్ ఇనిస్టిట్యూట్ (ఇండియా) లిమిటెడ్, హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సాయి లైఫ్ సైన్సెస్ కూడా ఉన్నట్టు మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు చెప్పాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, యూపీ ఉప ఎన్నికల ఫలితాలతో ఐపీఓ మార్కెట్ సెంటిమెంట్ పెరుగుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా ఈ వారం రాజేష్ పవర్ సర్వీసెస్ సహా మొత్తం ఆరు పబ్లిక్ ఇష్యూలు ప్రారంభమవుతుండగా ఎన్‌టీపీసీ గ్రీన్‌తో పాటు మరో మూడు కంపెనీలు మార్కెట్లో లిస్ట్ కానున్నాయి.

లాభాల బాటలోనే.!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, డాలర్ దూకుడు తగ్గటం, చైనా ఉద్దీపన పథకంతో పెద్దగా ప్రయోజనాలు లేకపోవటం, విదేశీ సంస్థాగత మదుపరులు మళ్లీ తిరిగొచ్చే సూచనలు, అదానీపై కోర్టు అభియోగాల ప్రభావం తగ్గిపోవటమే ఇందుకు కారణాలు. గత శుక్రవారం సెషన్ ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం నింపింది. ఫండమెంటల్స్ బలంగా ఉన్న షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్రలో బీజేపీ విజయం కూడా పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపింది.

స్టాక్ రికమండేషన్స్

జుబిలెంట్ ఫుడ్స్: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. తాజా త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉండటం, ఈపీఎస్ పెరగటంతో మూమెంటమ్ కనిపిస్తోంది. జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ షేరు కొంత దిద్దుబాటుకు లోనైంది. ప్రస్తుతం ఈ షేరు అక్యుములేషన్ జోన్‌లో ఉంది. గత శుక్రవారం 4.5 శాతం లాభంతో రూ.637 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.630/600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.675/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.580 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పేటీఎం: పేమెంట్ బ్యాంక్ సేవలకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అనుమతి ఇచ్చినప్పటి నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో దూసుకుపోతోంది. నష్టాల మార్కెట్లోనూ పటిష్ఠతను సూచించింది. రిలేటివ్ స్ట్రెంత్ చాలా బాగుంది. ప్రస్తుతం కీలక రెసిస్టెన్స్ జోన్ వద్దకు చేరుకుంటోంది. దాన్ని బ్రేక్ చేస్తే ఇక తిరుగులేదు. గత శుక్రవారం 6.5 శాతం లాభంతో రూ.900 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.960/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.860 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫీనిక్స్ మిల్స్ లిమిటెడ్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 33 శాతం మేర పతనమైంది. తాజాగా మళ్లీ పెరుగుతూ వస్తోంది. చివరి నాలుగు సెషన్లలో ఏకంగా 18 శాతం పెరిగింది. గత శుక్రవారం 5.33 శాతం లాభంతో రూ.1,616 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,600 స్థాయిలో ప్రవేశించి రూ.1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,560 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సుప్రియా లైఫ్ సైన్సెస్: ఐపీఓ ఇష్యూ ధర నుంచి 70 శాతం మేర పతనమైన ఈ షేరు గత ఏడాది మార్చి నుంచి టర్న్ అరౌండ్ అయ్యాయి. అప్పటి నుంచి బుల్‌రన్ కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ షేరుకు ఐపీఓ గరిష్ఠ స్థాయి వద్ద మద్దతు లభించింది. సేల్స్, ఈపీఎస్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం 14 శాతం లాభంతో రూ.806 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.780 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.860/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విజయ డయాగ్నస్టిక్స్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతోంది. మెరుగైన ఫలితాలు ప్రకటించటం, ఈపీఎస్, సేల్స్ పెరగటంతో మూమెంటమ్ పెరిగింది. బడా ఇన్వెస్టర్లు అక్యుములేట్ చేసుకుంటున్నారు. చివరి మూడు సెషన్లలో 25 శాతం పెరిగిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,200 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,160 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,000 ఎగువన నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో డౌన్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 23,300 కన్నా దిగజారినా శుక్రవారం ఏర్పడిన బలమైన రికవరీలో 560 పాయింట్ల మేరకు లాభపడింది. చివరికి గత వారంతో పోల్చితే 375 పాయింట్ల లాభంతో 23,900 సమీపంలో ముగిసింది. టెక్నికల్‌గా మార్కెట్ ఎనిమిది వారాల డౌన్‌ట్రెండ్ అనంతరం రిలీఫ్ ర్యాలీ సాధించింది. అయితే మార్కెట్ ఇప్పటికీ మద్దతు స్థాయిల కన్నా పైనే ఉంది. మార్కెట్ నిట్టనిలువుగా బౌన్స్‌బ్యాక్ సాధించినందు వల్ల స్పష్టమైన సందేశం ఇవ్వాలంటే కన్సాలిడేట్ కావడం తప్పనిసరి. అయితే ఈ రివర్సల్‌తో తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పును మాత్రం తప్పించుకుంది. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 975 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 155 పాయింట్లు లాభపడ్డాయి. ఈ వారంలో నిఫ్టీ మరింత పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో 24,000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత పాజిటివ్ సంకేతం ఇవ్వాలంటే నిఫ్టీ తదుపరి నిరోధం 24,100 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధ స్థాయిలు 24,350, 24,550. ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు.

బేరిష్ స్థాయిలు: ఏ మాత్రం బలహీనత ప్రదర్శించినా మద్దతు స్థాయి 24,000 వద్ద కన్సాలిడేషన్ తప్పనిసరి. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయిలు 23,800, 23,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 950 పాయింట్ల మేరకు రికవరీ సాధించి చివరికి 51,000 కన్నా స్వల్పంగా పైన క్లోజైంది. మరింత సానుకూలత కోసం తదుపరి నిరోధం 51,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,200. ప్రస్తుత మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 49,400.

పాటర్న్: నిఫ్టీ గత వారం 200 డీఎంఏ వద్ద రికవరీ సాధించింది. ఇప్పుడు నిరోధ స్థాయి 24,100 సమీపంలో గల 25 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. మార్కెట్ గత వారం ఓవర్‌సోల్డ్ స్థితి నుంచి కోలుకుంటున్నట్టు కనిపిస్తోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,000, 24,155
మద్దతు	24,000, 23,920



నవ్య | చిత్రజ్యోతి



ఆ కోరికను పుష్ప 2 తీర్చింది

'పుష్ప చిత్రం అంతర్జాతీయ స్థాయిలో నాకు నటుడిగా గుర్తింపును ఇచ్చింది. డిసెంబర్ 5న వస్తున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రంతో దేశవ్యాప్తంగా వైల్డ్ ఫైర్ రాబోతోంది. మూడేళ్లు నా జీవితాన్ని ఈ సినిమాకు అంకితం చేశాను. హీరో అయినప్పటి నుంచి చెన్నైలో నా సినిమా కార్యక్రమం ఒక్కటైనా చేయాలనుకుంటున్నాను. ఆ కోరికను 'పుష్ప 2' తీర్చింది' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. ఆదివారం చెన్నైలో 'వైల్డ్ ఫైర్' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అల్లు అర్జున్, శ్రీలీల నర్తించిన ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ 'రష్మిక తక్కువ సమయంలోనే నా మనసుకు దగ్గరయ్యారు. తను నన్ను చాలా బాగా ప్రోత్సహించారు. అల్లు అర్జున్ పాట కావడంతో బాగా కష్టపడ్డాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'పుష్ప'కు ముందు తర్వాత అనేలా నా కెరీర్ మారింది. నా జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకంగా ఈ చిత్రం మిగిలిపోతుంది' అన్నారు.

ఖరీదైన కానుకలు ఇచ్చా



ఇటీవలే అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన వెబ్ సిరీస్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ఈ వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె హీరో వరుణ్ ధావన్‌తో 'స్పైసీ ర్యాపిడ్ ఫైర్' అనే సరదా సంభాషణలో పాల్గొన్నారు. 'ట్రూత్ అండ్ డేర్' గేమ్‌లా ఉండే ఇందులో.. వరుణ్ అడిగిన దానికి సమాధానం చెప్పాలి.. చెప్పలేకపోతే పచ్చిమిర్చి తినాలి. 'మీరు ఏ వస్తువుల కోసం డబ్బులు అనవసరంగా ఖర్చు చేశారు' అని వరుణ్ అడిగారు. "నా ఎక్స్‌కు ఇచ్చిన కానుకల కోసం' అని సమంత సమాధానమిచ్చారు. 'అవునా.. ఎంత ఖర్చైంది' అని వరుణ్ అడగ్గా.. 'కొంచెం ఎక్కువే.. ఇక, తరువాతి ప్రశ్నకు పోదామా' అని సమంత బదులిచ్చారు. 'మీరు ఈ కార్యక్రమానికి వచ్చే ముందు ఎవరికి చివరగా మెసేజ్ చేశారు. దాన్ని పైకి చదివి వినిపిస్తారా' అని వరుణ్ అడగ్గా.. ఆ ప్రశ్నకు సమాధానమివ్వని సామ్ పచ్చిమిర్చి తిన్నారు.

ప్రేమంటారా? కాదంటారా?



ప్రేమలో ఉన్నామని పైకి చెప్పకపోయినా తరచూ చెట్టాపట్టాల్ వేసుకొని తిరుగుతూ కెమెరాలకు చిక్కుతున్నారు విజయ్‌దేవరకొండ, రష్మిక మందన్న. తాజాగా ఈ జంట మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది. వీరిద్దరూ కలసి ఓ రెస్టారెంట్‌లో భోజనం చేస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చెన్నైలో నిర్వహించిన 'పుష్ప 2' కార్యక్రమంలో 'మీ ప్రేమ, పెళ్లి గురించి చెప్పండి' అని యాంకర్ రష్మికను అడగ్గా 'తొందరెందుకు 'పుష్ప 2' విడుదలయ్యాక మీరే చూస్తారు కదా' అని బదులిచ్చారు. ఇండస్ట్రీకి చెందిన వ్యక్తా, బయట వ్యక్తా అని అడిగితే 'అది అందరికీ తెలిసిన విషయమే కదా' అంటూ స్పందించారు.





మహిళా సంఘాల నిధుల గోల్‌మాల్‌పై విచారణ


డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్‌కు సమస్యను వివరిస్తున్న బాధిత మహిళలు

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అత్తలూరు, ధరణికోట, వైకుంఠపురం, చావపాడు గ్రామాల్లో గ్రామ సమైక్య సంఘాల సభ్యుల రుణాల చెల్లింపులో జరిగిన సుమారు రూ. 1.5 కోట్ల గోల్‌మాల్‌కు సంబంధించి పత్రికలలో వచ్చిన కథనాలకు జిల్లా కలెక్టర్ స్పందించారు. డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్‌ను విచారణకు ఆదేశించారు. ఆయన ఆదివారం మండల సమాఖ్య కార్యాలయంలో విచారణ చేపట్టారు. రుణాలు చెల్లించినప్పటికీ అప్పులు ఉన్నట్లు చూపిస్తున్నాయని బాధిత మహిళలు వీవోలు చేసిన మోసాన్ని బాలునాయక్ దృష్టికి తీసుకువచ్చారు. స్త్రీనిధితోపాటు తాము తీసుకున్న పలు రుణాలు తిరిగి చెల్లించినప్పటికీ బ్యాంకులలో తమ పేరున అప్పులు అలానే ఉన్నాయని మండల సమాఖ్యకు బాధిత మహిళలు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల్లో మూడు కమిటీలను ఏర్పాటు చేసి సంఘాల వద్ద విచారణ జరిపిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, నగదు రికవరీ చేసి న్యాయం చేస్తామని బాలునాయక్ హామీ ఇచ్చారు. కొందరు మహిళలు తమ యానిమేటర్‌ను తొలగించాలని కోరడంతో గ్రామ సమాఖ్య సంఘాలు తీర్మానం చేసుకుని తొలగించుకోవచ్చని తెలిపారు. విచారణలో శ్రీనిధి ఏజీఎం ఆర్.చినబుల్లయ్య, హనుమాన్ నాయక్, ఏపీఎం కృష్ణప్రియ, మండల సమాఖ్య అధ్యక్షురాలు చింకా నాగలక్ష్మి, శివకుమారి, భాగ్యలక్ష్మి, బూక్యా బాలమ్మ, మరియమ్మ, సీసీలు పాల్గొన్నారు.

పోటాపోటీగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

- కర్నూలు జట్టుపై ఉమ్మడి గుంటూరు జట్టు విజయం


విజయం సాధించిన ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు

కారంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-14 విభాగపు బాలబాలికల ఖోఖో పోటీలు ఆదివారం పోటాపోటీగా సాగాయి. బాలుర విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు, కర్నూలు జట్టుపై 10-7 తేడాతో విజయం సాధించింది. అలాగే చిత్తూరు జట్టు, ఈస్ట్ గోదావరి జట్టుపై 10-6, విశాఖ జట్టు విజయనగరం జట్టుపై 9-8, ప్రకాశం జట్టు కడప జట్టుపై 11-6 తేడాతో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. బాలికల విభాగంలో చిత్తూరు జట్టు ప్రకాశం జట్టుపై 10-6, విజయనగరం జట్టు కడప జట్టుపై 9-3, విశాఖపట్నం జట్టు అనంతపురం జట్టుపై 9-8 తేడాతో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. బాలుర సెమీ ఫైనల్స్‌లో చిత్తూరు - గుంటూరు, విశాఖ - ప్రకాశం, బాలికల సెమీ ఫైనల్స్‌లో చిత్తూరు - విజయనగరం, శ్రీకాకుళం - విశాఖపట్నం జట్టు పోటీ పడనున్నాయి.

నేడు, రేపు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

సత్తెనపల్లి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం వద్ద గల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ జాన్సన్ ఆదివారం తెలిపారు. ప్రదర్శనకు చైర్మన్‌గా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వ్యవహరిస్తున్నారన్నారు. ఎంపిక చేసిన 70 ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటున్నారని ప్రిన్సిపల్ తెలియజేశారు. ప్రారంభ కార్యక్రమానికి మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, పలువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నట్లు జాన్సన్ తెలిపారు.

నేడు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా సోమవారం గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేస్తున్నట్లు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఈ నెల 26వ తేదీన విశాఖపట్నం నుంచి గుంటూరు రావాల్సిన సింహాద్రి ఎక్స్‌ప్రెస్ కూడా రద్దు అవుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని డీఆర్‌ఎం విజ్ఞప్తి చేశారు.

అక్రమ వ్యాపారాలను అరికట్టేదెలా?

- జీరో బిజినెస్‌పైనే మిర్చి స్థానిక లావాదేవీలు
- ఎక్కువగా కారం మిల్లులకు అమ్మకాలు
- ఐదుశాతం జీఎస్‌టీని ఎగ్గొట్టేందుకే ఈ వ్యవహారం

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)లో ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు కలిసి చేసే జీరో బిజినెస్‌పైనే మిర్చి స్థానిక లావాదేవీలు జరుగుతాయి. యార్డు చుట్టుపక్కల ఉన్న కారం మిల్లులతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉన్నవాటికి జీరో బిజినెస్‌లోనే ఎండు మిరపకాయలను సరఫరా చేస్తుంటారు. ఇందుకు కారణం మిర్చిని సరఫరా చేసిన వెంటనే నగదు చేతికందుతుంది. కొనుగోలు చేసిన వ్యాపారి 5 శాతం జీఎస్‌టీని వాణిజ్య పన్నుల శాఖకు పంగనామం పెడతారు. మిర్చి పండని తూర్పు, పశ్చిమ గోదావరి లాంటి జిల్లాలకు కూడా జీరో బిజినెస్‌లోనే మిర్చి ఎగుమతి జరుగుతుంటుంది. ఉత్తరాదిన ఉన్న కొన్ని రాష్ట్రాలకు కూడా ఇదే విధానంలో మిర్చిని వ్యాపారస్తులు పంపిస్తారు. దీనివలన ఏటా రూ.కోట్లలోనే మార్కెట్ ఫీజు రూపంలో మిర్చియార్డుకు, జీఎస్‌టీ రూపంలో వాణిజ్య పన్నుల శాఖకు నష్టం వాటిల్లుతుంది. ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా విచారణ జరిపి నిర్ధారించింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి మిర్చియార్డులో జీరో బిజినెస్‌ని పూర్తిగా నిలిపేయాలని పర్సన్ ఇన్‌చార్జ్ అమిలినేని భార్గవ తేజ ఆదేశాలు జారీ చేశారు. అవి ఏమేరకు అమలు జరుగుతాయన్నది చర్చనీయాంశంగా మారింది.

వ్యాపారస్తులు కూడబలుక్కుని..

రైతులు తీసుకొచ్చే మిర్చిని యార్డులో కమీషన్ వ్యాపారస్తుల ద్వారా కొనుగోలు చేసినందుకు ఒక శాతం మార్కెట్ ఫీజుని ఎగుమతిదారులు మార్కెట్ కమిటీకి చెల్లిస్తారు. కమీషన్ వ్యాపారస్తులు రైతు వద్ద 2 శాతం వసూలు చేసుకుంటారు. ఎగుమతిదారులు చెల్లించే 1 శాతం మార్కెట్ ఫీజుపైనే మార్కెట్ కమిటీ నిర్వహణ ఆధారపడి ఉంటుంది. అయితే దిగుమతి, ఎగుమతి వ్యాపారస్తులు కూడబలుక్కుని దీనిని మార్కెట్ కమిటీకి రాకుండా చేస్తున్నారు. నిత్యం కొన్ని వందల మిర్చి టిక్కీలు ఇలా జీరోలో బయటకు వెళ్లిపోతున్నాయి. ఈ విషయం యార్డు సూపర్‌వైజర్లకు తెలియకుండా జరిగే వ్యవహారం కాదు. ఇందులో సూపర్‌వైజర్ల పాత్ర కూడా ఉంటుందనేది బహిరంగ రహస్యమే.

ట్రేడింగ్ జరగలేదని చెప్పి..

యార్డు పరిసర ప్రాంతాల్లో పలు కారం తయారీ మిల్లులున్నాయి. వీటిల్లో ఉత్పత్తి అయిన కారం స్థానిక అవసరాలకే కాకుండా ఇతర ప్రాంతాలకు ఎక్స్‌పోర్టు అవుతుంది. దీంతో కారం మిల్లుల యజమానులు ఎగుమతిదారుల ద్వారా మిర్చిని కొనుగోలు చేస్తారు. ఇక్కడే జీరో వ్యాపారానికి తెర తీస్తారు. మిర్చియార్డులో ట్రేడింగ్ జరగలేదని చెప్పి కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేయడానికి తీసుకెళ్తున్నామని చెప్పి యార్డు గేటు దాటిస్తారు. అయితే అప్పటికే ఆ మిర్చిని ఎగుమతిదారుడు కొనుగోలు చేసి ఉంటాడు. ఇలా గేటు దాటిన మిర్చిని నేరుగా కారం మిల్లులకు చేర్చి అక్కడ కారం తయారీకి వినియోగిస్తారు. దీనివలన మిర్చియార్డుకు ఎలాంటి ఆదాయం రాకుండా పోతుంది. అలానే గుంటూరు మార్కెట్ కమిటీ పరిధిలోని కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిర్చిని విక్రయించాలన్నా యార్డుకు ఫీజు చెల్లించాలి. కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వలపై సరైన అజమాయిషీ, లెక్కలు లేని కారణంగా ఇక్కడ సులభతరంగా జీరో బిజినెస్ జరుగుతుంది.

కటింగ్ బిజినెస్‌ని గుర్తించాలంటే..

రేట్ కటింగ్ బిజినెస్ మిర్చియార్డులో విచ్చలవిడిగా జరుగుతుంటుంది. ఎగుమతిదారుడు క్వింటాల్ రూ. 16 వేలకు కొనుగోలు చేసి లెక్కల్లో మాత్రం క్వాలిటీ బాగాలేదనో, వేరే రకం మిరపకాయలనో నమోదు చేసి ధరని రూ. 12 వేలకు తగ్గిస్తారు. దీనివలన కూడా మార్కెట్ ఫీజు, జీఎస్‌టీ రూపంలో కోత పడుతున్నది. ఈ అక్రమ వ్యాపారాన్ని గుర్తించాలంటే చాలా కష్టం. ఈ అక్రమ వ్యాపారాలను అరికట్టాలన్న జేసీ భార్గవతేజ ఆదేశాలు ఏమేరకు అమలు జరుగుతాయో వేచి చూడాల్సిందే.

మెగా జాబ్ మేళాలో మెరుగైన ఉద్యోగాలు

- రాష్ట్ర వ్యాప్తంగా 11,500 మంది హాజరు
- 60 కంపెనీలు.. 3,604 మందికి ఉద్యోగాలు
- మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపిన యువత



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో అధికారులు, నేతలు

మంగళగిరి సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఆదివారం మంగళగిరిలో నిర్వహించిన మెగా జాబ్ మేళా నిరుద్యోగులకు వరంలా మారింది. జాబ్‌మేళాకు రాష్ట్ర నలుమూలల నుంచి 11,500 మందికిపైగా హాజరు కాగా ప్రతిభ, అవగాహనా సామర్థ్యం ఆధారంగా 3,604 మందికి ఉద్యోగాలు లభించాయి. ఐటీ, డేటా ఎంట్రీ, బీపీవో, రిటైల్, ఈకామర్స్, టూరిజం, హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్, ఆటోమోటివ్, వైద్యం, ఫార్మసీ, ఎలక్ట్రికల్, బ్యాంకింగ్, పేటీఎం, ఎయిర్‌టెల్, రిలయన్స్, హీరో మోటార్స్, మాస్టర్ మైండ్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఇన్సూరెన్స్, మెడ్‌ప్లస్ తదితర రంగాల్లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జాబ్ మేళా జరిగింది. మంగళగిరి నియోజకవర్గ యువత కోసమే జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రకటించినప్పటికీ రాష్ట్ర నలుమూలల నుంచి యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఏడు నుంచి పదో తరగతి చదివిన వారు, ఇంటర్, డిప్లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, బీఈ, బీటెక్, ఎంటెక్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ, పీజీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. 60కి పైగా కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూల ఆధారంగా రూ.15 వేల నుంచి రూ.60 వేల వరకు జీతం కలిగిన ఉద్యోగాలకు 3,604 మందిని ఎంపిక చేయగా, కూటమి నేతల చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. అభ్యర్థులకు నియామక పత్రాలు అందించిన అనంతరం కూటమి నేతలు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా మంగళగిరిలో మెగా జాబ్‌మేళా ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవతో అనేక ప్రముఖ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

సూర్యలంక తీరం.. జనసంద్రం

- పోటెత్తిన లక్షమందికిపైగా పర్యటకులు


బాపట్ల సూర్యలంక తీరంలో భారీగా పర్యాటకులు

బాపట్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) బాపట్ల మండలం సూర్యలంక తీరంకు ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో రావటం కార్తీక పౌర్ణమి రోజును తలపించింది. సుమారు లక్షమందికి పైగా పర్యాటకులు తీరంకు వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేశారు. సెలవు రోజు కావడం పైగా కార్తీకమాసం చివరి ఆదివారం కావటంతో దూరప్రాంతాల నుంచి పర్యాటకులు, భక్తులు తీరానికి పోటెత్తారు. దూరప్రాంతాల నుంచి వాహనాల ద్వారా తెల్లవారుజామునే తీరానికి చేరుకుని పుణ్యస్నానాలను ఆచరించారు. తీరంలో యువకులు కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. చిన్నారులు ఇసుక తిన్నెలతో ఆడుకుంటూ ఆనందంగా గడిపారు. మహిళలు, మాలాధరణ భక్తులు తీరం ఒడ్డున ఇసుకతిన్నెలతో శివలింగాలను ప్రతిష్ఠించి కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సామాజిక వర్గాల వారు తీరం సమీపంలోని జీడిమామిడి తోటల వద్ద కార్తీక వనభోజనాలను నిర్వహించుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు ఆదర్శనగర్ సమీపంలోని జీడిమామిడి తోటల వద్ద కుటుంబ సమేతంగా వనభోజనాలను చేస్తూ సంతోషంగా గడిపారు. తీరం సమీపంలో ఉన్న అంజనేయస్వామి దేవాలయం, శ్రీతారకేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిక్కిరిసింది. సూర్యలంక తీరంకు వాహనాలు అధిక సంఖ్యలో రావటంతో పూర్తిస్థాయిలో ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో బాపట్ల రూరల్ సీఐ గంగాధరరావు తన సిబ్బందితో పర్యవేక్షించారు.

ఆశ్రం కళాశాలలో పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య


మృతుడు డాక్టర్ వరగాని జవహర్

ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు సమీపంలోని ఆశ్రం మెడికల్ కాలేజీలో పోస్టుగ్రాడ్యుయేషన్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన వరగాని జవహర్ (30) ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీలో పీజీ చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి 9 గంటల వరకూ ఆసుపత్రి అత్యవసర విభాగంలో డ్యూటీ చేయడానికి వచ్చారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో ఆయన వాష్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు గడియపెట్టుకుని ఎంత సేపటికీ రాలేదు. ఉదయం 8.15 గంటలకు మిగిలిన డాక్టర్లు వెళ్లి చూడగా తలుపు వేసి ఉంది. దీంతో ఆసుపత్రి సీఈవో డాక్టర్ హనుమంతరావు ఇతర అధికారులకు తెలియజేసి వెంటనే తలుపులను పగులగొట్టి చూశారు. డాక్టర్ జవహర్ మరణించి ఉన్నారు. అక్కడ మత్తు ఇంజక్షన్లు, సిరంజ్‌లు లభించాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. జవహర్ తండ్రి డాక్టర్ విజయ్‌సాగర్ నర్సరావుపేటలో పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులుగా ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. జవహర్ తన తల్లిదండ్రులకు ఒకే ఒక్క సంతానం. జవహర్ మత్తు వైద్యుడిగా చదువుతూ మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో మెడికల్ కాలేజీలో తీవ్ర విషాదం నెలకొంది. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. ఏలూరు రూరల్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం జరిపి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

రేపటి వాక్ ఇన్ అడ్మిషన్స్ రద్దు

గుంటూరు సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (హాన్స్) అగ్రికల్చర్ కోర్సుకు ఈ నెల 26న జరగాల్సిన వాక్ ఇన్ అడ్మిషన్స్ ప్రక్రియను రద్దు చేసినట్లు రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆరోజున వాక్ ఇన్ అడ్మిషన్స్‌కు హాజరు కావాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

గత ప్రభుత్వంలో మైనార్టీలపై వివక్ష

- ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్


సమావేశంలో మాట్లాడుతున్న ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్

పిడుగురాళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలు ఎంతో వివక్షతకు గురయ్యారని, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ అన్నారు. ఆదివారం పిడుగురాళ్ల ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మైనార్టీలకు రావాల్సిన పథకాలు గత ఐదేళ్లుగా ఎన్నో నిలిపివేశారని, 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ముస్లింలకు ఒక స్వర్ణయుగంలా ఉందన్నారు. ఆడపిల్లల వివాహానికి దుల్హన్ పథకం కింద రూ. 50 వేలు, దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా ఇమామ్, మౌజన్‌లకు జీతాలు, షాదీఖానా, ఈద్గాలు, మదర్సా నిర్మాణాలు ఎన్నో జరిగాయన్నారు. మాయమాటలతో గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి ఎంతో ద్రోహం చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై నమ్మకం ఉంచి మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ బాబావలి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలీ, అబ్దుల్లా, ముజీబ్, కార్ సైదా, టీడీపీ మస్తాన్‌వలి, ఫరీద్ మేస్త్రి, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు. గుంటూరు నుంచి దాచేపల్లి వస్తుండగా మార్గమధ్యంలోని సత్తెనపల్లిలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్‌ను సత్తెనపల్లి టీడీపీ ముస్లిం నేతలు ఘనంగా సన్మానించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 585.90 అడుగులు ఉంది. ఇది 300.03 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3431 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 15,651 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 15,651 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఐఎంఏ రాష్ట్ర ఉత్తమ కార్యదర్శిగా డాక్టర్ నరేంద్రరెడ్డి

- గుంటూరు శాఖకు మూడు పతకాలు



పతకాలతో డాక్టర్ నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ కార్యదర్శిగా జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అవార్డు అందుకున్నారు. 2023-24 సంవత్సరానికి గుంటూరు శాఖను అన్ని విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచేలా తీర్చిదిద్దినందుకుగానూ డాక్టర్ నరేంద్రరెడ్డికి ఈ అవార్డు దక్కింది. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో జరుగుతున్న ఐఎంఏ రాష్ట్ర శాఖ 66వ వార్షిక సదస్సులో ఐఎంఏ రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌వీ అశోకన్, కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర నూతన అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ చేతులు మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఉత్తమ కార్యదర్శితోపాటు గుంటూరు శాఖకు ఉత్తమ సేవా విభాగం, విపత్కర పరిస్థితుల్లో ఉన్న వారికి ఆపన్నహస్తం (ఫ్లడ్ రిలీఫ్) అందించినందుకుగానూ మరో రెండు పతకాలు లభించాయి. ఈ సందర్భంగా ఐఎంఏ నేతలు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అనేక కార్యక్రమాలు చేపట్టి గుంటూరు బ్రాంచ్‌కి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారని ప్రశంసించారు. గుంటూరు ఐఎంఏ బ్రాంచ్ చరిత్రలో నిలిచిపోయేలా డాక్టర్స్ దివాళీ సెలబ్రేషన్స్, ఇఫ్తార్ విందు, ఆర్‌జీ కర్ కాలేజి ఘటన నిరసన కార్యక్రమాలను తనదైన శైలిలో నిర్వహించారని తెలిపారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత


స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో కొమ్మాలపాటి

పెదకూరపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యలో ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులకు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం స్కాలర్‌షిప్పులు అందజేశారు. అమెరికాలో స్థిరపడిన రాయపూడి రామకృష్ణ విద్యార్థులకు లక్షా 15 వేల రూపాయల స్కాలర్‌షిప్ ప్రకటించి, కొమ్మాలపాటి శ్రీధర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ అసమాన ప్రతిభతో రాణించి, అమెరికాలో స్థిరపడిన యువకులు అనేకమంది గత ఎన్నికల్లో టీడీపీ కోసం ఇండియా వచ్చి పని చేశారని, ఆ తరువాత కూడా ఈ రూపంలో సహాయం చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వెన్నా సాంబశివారెడ్డి, వరప్రసాద్, రాయపూడి శంకర్రావు, నరసింహారావు, రవి, సోమయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాడాలి


వేడుకల్లో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం

గుంటూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు పోరాడాలని, ప్రభుత్వ విద్య ద్వారానే సామాజిక న్యాయం దక్కుతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను ఆదివారం గుంటూరు ఎన్జీవో హోంలో నిర్వహించారు. తొలుత వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి ఎన్జీవో హోం వరకూ ఉపాధ్యాయుల ర్యాలీ నిర్వహించారు. మహాసభల ప్రారంభ సూచికగా జాతీయ జెండాను, ఎస్‌టీఎఫ్ఐ జెండాను, యూటీఎఫ్ జెండాను యూటీఎఫ్ పూర్వ నాయకులు కేఎస్‌వీ దుర్గారావు, జి.ప్రభుదాసు, ఎస్.తాండవ కృష్ణ తదితరులు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గత 30 ఏళ్లలో విద్యా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ పెరిగిందన్నారు. విద్యా ప్రైవేటీకరణను మరింత ప్రోత్సహించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యావిధానం తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన జీవో నం.117 నూతన విద్యావిధానంలో భాగమేనని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేస్తామని ఇంతవరకూ చేయలేదన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఉపాధ్యాయులు అందరిని ఒకే గొడుగు కిందకు తెచ్చిన ఘనత యూటీఎఫ్‌కు దక్కుతుందన్నారు. యూటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కె.జోజయ్య మాట్లాడుతూ 50 ఏళ్ల ఉద్యమ చరిత్రలో ఏకైక పెద్ద సంఘంగా, ఎన్నో విజయాలు సాధించిన సంఘంగా యూటీఎఫ్ నిలిచిందన్నారు. జిల్లా అధ్యక్షురాలు బి. ఆదిలక్ష్మి, రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏ.ఎస్.కుసుమ కుమారి, సీనియర్ నాయకులు ఎస్.తాండవకృష్ణ, కేఎస్‌వీ దుర్గారావు, జి.ప్రభుదాసు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ ప్రసంగించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం కప్ విజేతలు వీరే

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌ఎం కప్-2024 సెకండ్ ఎడిషన్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో బ్యాడ్మింటన్ డబుల్స్‌లో పురుషుల విభాగం నుంచి షేక్ అబ్బాస్, ప్రణయ్ గెలుపొందగా జి.రాజ్‌పాల్, షేక్ రియాజ్ రన్నరప్‌గా నిలిచారు. షేక్ ఏటీ రెహ్మాన్, ఎన్.రమేష్ మూడో స్థానాన్ని పొందారు. మహిళల విభాగంలో కలెక్టర్ ఆఫీసుకు చెందిన దివ్య, సంధ్య గెలుపొందగా, రైల్వేస్ నుంచి పాల్గొన్న పి.లావణ్య, ప్రాంజలి రన్నరప్‌గా నిలిచారు. గుంటూరు రైల్వేస్‌కు చెందిన ధనలక్ష్మి, నాగజ్యోతి మూడో స్థానంలో నిలిచారు. బాస్కెట్ బాల్ పోటీల్లో డీఆర్‌ఎం గుంటూరు జట్టు గెలుపొందగా రెండో స్థానంలో నిక్కీ బాలర్స్, మూడో స్థానంలో అంకిరెడ్డిపాలెం జట్లు నిలిచాయి. వాలీబాల్‌లో వికాస్ టీం గెలుపొందగా రెండో స్థానంలో డీఆర్‌ఎం, మూడో స్థానంలో కాజా టీంలు నిలిచాయి.

అగ్ని ప్రమాదంలో సిలిండర్ పేలి..

ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు


మృతుడు తులసీనాథ్ (ఫైల్)

పెదకాకాని, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెంకటకృష్ణాపురంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరి ఇల్లు దగ్ధం కాగా, ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన అమ్మిశెట్టి శ్రీనివాసరావు, అతని కుమార్తె సుజాత పూరి ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఇంట్లో దీపారాధన చేసి గ్రామానికి సమీపంలో ఉన్న నాగేంద్ర స్వామి పుట్ట వద్దకు వెళ్లారు. దీపారాధన నుంచి పెద్దమంట వచ్చి ఇంటికి అంటుకున్నాయి. ఈ ఘటనలో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో మూడు గ్యాస్ సిలిండర్లు ఉండగా అందులో రెండు వెంటనే పేలిపోయాయి. మూడో సిలిండర్ విషయం తెలియక గ్రామానికి చెందిన అమ్మిశెట్టి తులసీనాథ్(37), అమ్మిశెట్టి పరమేష్, అమ్మిశెట్టి వీరాంజనేయులు, అమ్మిశెట్టి మల్లికార్జునరావు సంఘటనా స్థలానికి వెళ్లారు. వీళ్లంతా ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తుండగా మూడో సిలిండర్ పేలింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. అమ్మిశెట్టి తులసీనాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ తులసీనాథ్ మృతి చెందాడు. పెదకాకాని సీఐ నారాయణస్వామి, అగ్నిమాపక శాఖ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉదయం జంపని శివాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వేమూరు ఎస్ఐ రవికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. వేమూరు గ్రామానికి చెందిన చల్లంచర్ల సుబ్రహ్మణ్యం తెనాలి వెళ్తుండగా, జంపని శివాలయం సమీపంలో తెనాలి నుంచి కొల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ప్రమాదంలో సుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుబ్రహ్మణ్యం సోదరుడు సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.95
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ గీతిక



బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.గీతిక హెచ్చరించారు. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో విస్తృత దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే బాపట్లలో 7 కేసులు నమోదు చేసి ఏడుగురిని అరెస్టు చేసి 12.06 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు. ముత్తాయపాలెం గ్రామంలో డిఫెన్స్ మద్యం కేసులో 6.75 మద్యం సీజ్ చేశామన్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. పిట్టలవానిపాలెం మండలంలో ఒక కేసు నమోదు చేసి 2.7 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేయటం జరిగిందన్నారు. కర్లపాలెం మండలంలో రెండు కేసులు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసి 2.52 లీటర్ల మద్యాన్ని సీజ్ చేయటం జరిగిందన్నారు. కర్లపాలెం మండలంలో షేక్ సప్రుద్దీన్‌ని అరెస్టు చేసి అతని వద్ద 1.44 లీటర్ల మద్యాన్ని సీజ్ చేయటం జరిగిందన్నారు. గతంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 9 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు సీఐ గీతిక తెలిపారు.

పేరలిలో 20 మద్యంబాటిళ్ళు స్వాధీనం

కర్లపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరలి పంచాయతీ అంబేద్కర్ విగ్రహ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఈపూరి అమలను అదుపులోకి తీసుకొని 21 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నామని బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ గీతిక తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రభుదాసు, సి బ్బంది అనూష, శివరాం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పేరలిలో మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకొని మహిళను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

రైతుల సమస్యలను పరిష్కరించాలి : సీఐటీయూ

రేపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో నవంబరు 26న జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రదర్శనలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు పదేళ్ళ క్రితం పెట్టిన 15 డిమాండ్లలో ఏ ఒక్క కోర్కెను మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రైతు, కౌలు రైతు సంఘాల ప్రతినిధులు కె.ఆశీర్వాదం, ఎ.ఝాన్సీ, జే.ధర్మరాజు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. మండల పరిధిలోని చింతమోటులో రాష్ట్ర సెర్ప్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సాల్మన్, వేణు, సుబ్బారావు, శాంతి పూర్ణచంద్రరావు, తిరుపతమ్మ, పద్మావతి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు వెంకయ్య, నాగయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రజలు కమ్యూనిస్టులను బలపరుస్తారు : గంగయ్య

బాపట్లనవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాలకవర్గాలు సృష్టించే దోపిడి విధానాలకు విసిగి పోయి ప్రజలు కమ్యూనిస్టులను బలపరిచే రోజు ఎంతో దూరంలో లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం సీపీఎం బాపట్ల పట్టణ 10వ సభకు ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతుందన్నారు. వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, కోట వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారికి పూజలు

పిట్టలవానిపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. ఆలయానికి పలు గ్రామాలు, ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

బాపట్లరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే పెదకూరపాడు మండలం గారపాడు గ్రామానికి చెందిన జి.అప్పారావు (55) తన కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో సూర్యలంక తీరానికి సముద్రస్నానానికి వస్తుండగా సూర్యలంక సమీపంలోని చప్టా వద్ద ఆటో ఆపి బయటకు దిగి రోడ్డు దాటుతుండగా బాపట్ల నుంచి సూర్యలంకకు వెళుతున్న ద్విచక్రవాహనం వేగంగా అప్పారావును ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన అప్పారావుని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలుష్య కోరల్లో లంక గ్రామాలు

- లారీలు, ఇసుక ట్రాక్టర్లతో దుమ్ము ధూళి
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- రోడ్లపై దుమ్ము లేవకుండా నీళ్లు చల్లించాలని గ్రామస్థుల వేడుకోలు

కొల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య కోరల్లో లంక గ్రామాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఇటుక, ఇసుక రవాణా వల్ల దుమ్ము, ధూళితో గృహాలు నిండిపోతున్నాయని లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొల్లూరు మండలం ఇటుక పరిశ్రమలకు ప్రసిద్ధి. లంక గ్రామాల్లో డిసెంబరు నుంచి మే నెల వరకు భారీ స్థాయిలో ఇటుక ఉత్పత్తి జరుగుతుంది. చేసిన ఉత్పత్తిని లారీలు, ట్రాక్టర్లు ద్వారా తెనాలి, బాపట్ల, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు చేరవేస్తుంటారు. పెసర్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం గ్రామాల గుండా ఇటుక, ఇసుక రవాణా జరుగుతుంటుంది. దీంతో ఆయా వాహనాల ద్వారా దుమ్ము, ధూళి ఇళ్లల్లోకి చేరడం ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. లంక గ్రామాల్లో ప్రజానీకం కాలుష్యంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇటుక ఉత్పత్తి సీజన్ కొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ఉత్పత్తికి అవసరమైన మట్టిని కల్లాల్లోకి ట్రాక్టర్ల ద్వారా తీసుకు వెళ్లే క్రమంలో ఆ మట్టి జారి రోడ్లపై పడి మరింత దుమ్ము, ధూళి ఎక్కువవుతుంది. కాలుష్యం నివారణ కోసం ఇటుక ఉత్పత్తిదారులు, ఇసుక రవాణాదారులు దుమ్ము, ధూళి లేవకుండా రోడ్లపై ట్యాంకర్ల ద్వారా నీరు చల్లిస్తే కొంత వరకు కాలుష్యం నివారణ అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.



లంక గ్రామాల్లో వాహనాలు వెళ్లేటప్పుడు ఏర్పడుతున్న దుమ్ము, ధూళి

ఇసుక ట్రాక్టర్ల వల్ల ఎక్కువ కాలుష్యం

ఉచిత ఇసుక విధానం ప్రభుత్వం అమలు చేయడంతో ఇసుక తీసుకు వెళ్లేందుకు సుదూర గ్రామాల నుంచి కూడా వందలాది ట్రాక్టర్లు నిత్యం గాజుల్లంక ఇసుక రీచ్‌కు వచ్చి వెళుతున్నాయి. ఈ రెండు నెలల కాలంలో ఇసుక ట్రాక్టర్లు తిరగడం వల్ల గ్రామాల్లో కాలుష్యం మరింత ఎక్కువైందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇసుక తీసుకు వెళ్లేందుకు వచ్చే ట్రాక్టర్ల నుంచి మెయింటెనెన్స్ ఖర్చుల కింద కొంత మంది ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ.100 వసూలు చేస్తున్నారని, ప్రతిరోజూ సుమారు 800-1000 ట్రాక్టర్లకు లోడింగ్ జరుగుతుందని ఆవులవారిపాలేనికి చెందిన ఓ ప్రజా ప్రతినిధి ఆరోపిస్తున్నారు. ఆ వసూలు చేసిన నగదుతో ట్యాంకర్ల ద్వారా తమ గ్రామాల్లోని ప్రధాన రోడ్లపై నీరు చల్లిస్తే దుమ్ము, ధూళి బాధ కొంత వరకు తగ్గుతుందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధనలు

● పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు, వివిధ కుల సంఘాల నాయకులు

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీయ సంఘ వనసమారాధనలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. భట్టిప్రోలు టీఎం రావు ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పద్మశాలీయ సంఘ వన సమారాధనకు ఎమ్మెల్యే హాజరై సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో పాల్గొని కొబ్బరి కాయ కొట్టారు. అనంతరం రెండు వేల మంది సంఘస్తులు వన సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పద్మశాలీయ సంఘం మండల అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు, తిరువీధుల బాలాజీ, ఎం.సత్యనారాయణ, పి.శివ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణస్వామి వ్రత పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు



చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

● బాపట్ల/కర్లపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాపు కార్తీక వనసమారాధన కార్యక్రమం బాపట్ల మండలం ఆదర్శనగర్ జీడిమామిడి తోటలో నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ అన్నంసతీష్ ప్రభాకర్ పాల్గొని ముందుగా 465 మంది విద్యార్థులకు రూ.20 లక్షల విద్యా పురస్కారాలను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వితంతు, ఒంటరి కాపు మహిళల ఆర్థికచేయూత కొరకు 20 కుట్టుమిషన్‌లు, గ్రైండర్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కాపుల ఐక్యతతోపాటు ఈ సమాజంలో ఉన్నతస్థితికి చేరేందుకు భవిష్యత్తు తరాలకు విద్య ద్వారానే సాధ్యమని అన్నారు. అనంతరం మహిళలకు వివిధ ఆటల పోటీలను నిర్వహించగా విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అన్నం సతీష్ ప్రభాకర్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కాపు సంఘ నాయకులు, ఆలిండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ ఛైర్మన్ మెండు మహేంద్రభాస్కరరావు, కార్డియాలజి స్పెషలిస్ట్ ఇమ్మడిశెట్టి మారుతి కృష్ణ, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఏనుగుల చైతన్య మురళీ, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్‌లు చాపల సుబ్రహ్మణ్యం, పుప్పాల సాయిబాబు, కాపు సంఘ నాయకులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, పర్వతరెడ్డి భాస్కరరావు తదితరులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ఎంఎం భాస్కరరావు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఏనుగుల చైతన్యమురళీ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ, అంబటి మురళీకృష్ణ, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యా పురస్కారాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

● బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యాదవ కార్తీక వనసమారాధన మహోత్సవం ఆదివారం సూర్యలంక సమీప తీరంలో జీడిమామిడి తోటల వద్ద నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యాదవులు అందరూ ఐక్యంగా ఉండి రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే కొండయ్యను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొలపల శ్రీనివాసరావు, మద్దిబోయన సోమరాజు, పులివాసు, పిన్నిబోయన ప్రసాద్, తోట నారాయణ పాల్గొన్నారు.

● బాపట్ల పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కాలనీలో ఉన్న శ్రీగోవిందమాంబ సమేత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఆలయంలోని శ్రీ కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామికి, ఉసిరిచెట్లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం వాస్తుసిద్ధాంతి మారేళ్ళ పోతులూరి వీరబ్రహ్మాచారిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెదురుపర్తి లక్ష్మణామూర్తి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కటలి జగదీష్, సెక్రటరి చిత్తరంజన్ శర్మ, ప్రభాకర్ విశ్వకర్మ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శివునికి ప్రీతికరమైన పవిత్ర కార్తీకమాసంలో వనసమారాధన నిర్వహించటం ద్వారా గ్రామాల్లో ఐక్యత పెరుగుతుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని పేటేరు గ్రామంలో శ్రీమహాలక్ష్మిగుండెపాటెమ్మ అమ్మవారి దేవస్థానంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించగా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆర్థిక విరాళాన్ని అందించారు. తొలుత గుండెపాటెమ్మ అమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● రేపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీక వనసమారాధనల ద్వారా మానసిక ఉల్లాసంతోపాటు గ్రామాల్లో ఐకమత్యం పెరుగుతుందని జనసేన పార్టీ నాయకులు కమతం సాంబశివరావు అన్నారు. మండలంలోని ఉప్పూడి గ్రామంలోని శ్రీ సీతారామస్వామి దేవాలయంలో ఆదివారం భవాని భజనభక్త బృందం నిర్వహించిన కార్తీక వనసమారాధనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో కమతం విజయకుమారి, దామెర్ల రాజారావు, గంగాభవాని, యార్లగడ్డ శివకుమారి, టి.వెంకటసుబ్బమ్మ, టి.సునీత, పద్మావతి, రమాదేవి, తోట పద్మజ, కృష్ణకుమారి, నాగమల్లేశ్వరి, కందుల బ్రహ్మచింతారావు, బాలాజీనాయక్, కమతం పోతురాజు, బి.గంగాధర్ పాల్గొన్నారు.



వనసమారాధనలో భోజనాన్ని వడ్డిస్తున్న మంత్రి సోదరుడు శివప్రసాద్



పూజలు నిర్వహిస్తున్న జనసేన పార్టీ నాయకులు కమతం సాంబశివరావు

గాయత్రి హేచరీని సందర్శించిన అధికార బృందం

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ఆహార సంస్థ, గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ సంస్థ ప్రతినిధి, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాన్యుల్ బెరాంజ్, మత్స్యశాఖ కమిషనర్ టి.డొలా శంకర్, మత్స్యశాఖ జేడీ లాల్ అహ్మద్, స్థానిక మత్స్యశాఖాధికారులతో కలిసి ఆదివారం బాపట్ల మండలం పాండురంగాపురంలోని గాయత్రి హేచరీని సందర్శించారు. గాయత్రి తల్లి రొయ్యల హేచరీ, తల్లి రొయ్యల పెంపక పాలిటిక్స్ యూనిట్స్‌ను పరిశీలించారు. ఆక్వా కల్చర్ మంచి యాజమాన్య పద్ధతులు, సుస్థిరమైన సాగు కోసం ఆక్వా కల్చర్‌లో కర్బన ఉద్గారాలను తగ్గించే ప్రక్రియలో భాగంగా సందర్శించి అధ్యయనం చేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి డాక్టర్ పి.సురేష్, నిజాంపట్నం మత్స్యశాఖ ఏడీ భూక్యా సైదా, బాపట్ల మత్స్యశాఖాధికారి రవీంద్ర, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



తల్లిరొయ్యల పెంపక పాలికిట్స్ యూనిట్స్‌ను పరిశీలిస్తున్న గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ సంస్థ ప్రతినిధి డాక్టర్ మాన్యుల్ బెరాంజ్, మత్స్యశాఖ కమిషనర్ టి.డొలా శంకర్ తదితరులు

ధాన్యం సేకరణపై నేటి నుంచి గ్రామసభలు

● తహసీల్దార్ మెహర్‌కుమార్

పిట్టలవానిపాలెం, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : మండలంలో వరి ధాన్యం సేకరణపై సోమవారం నుంచి రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించటం జరుగుతుందని పిట్టలవానిపాలెం మండల తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్ ఒక సంయుక్త ప్రకటన పేర్కొన్నారు. సోమ వారం పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెం, మంగళవారం జిఎన్ పాలెం, పోతనకట్టవారిపాలెం, బుధవారం పిట్టువారిపాలెం, భవనంవారిపాలెం, గురువారం అల్లూరు, ఖాజీపాలెం, శుక్రవారం చందోలు-1, 2 సచివాలయాలు, శనివారం సంగుపాలెంకోడూరు, కోమలి గ్రామ సచివాలయాలలో గ్రామసభలు ఏర్పాటు చేయటం జరుగుతుందని వారు తెలిపారు. గ్రామసభలలో వరి ధాన్య సేకరణ కార్యక్రమాన్ని వీఆర్వోలు, సంబంధిత శాఖల అధికారులు నిర్వహిస్తారని వారు పేర్కొన్నారు.

చంద్రబాబు పర్యటనకు పూర్వ విద్యార్థులకు ఆహ్వానం

● సినీనటుడు చిరంజీవి వస్తున్నారని ప్రచారం

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిసెంబరు 7వ తేదీన సీఎం హోదాలో తొలిసారిగా బాపట్లకు వస్తున్నట్లు జిల్లా అధికారులు ప్రకటించారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరిగే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి పాల్గొంటున్నారు. కాగా ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన ప్రముఖ సినీనటుడు డాక్టర్ చిరంజీవి ఈ మీటింగ్‌కు వస్తున్నారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది. పూర్వవిద్యార్థుల సంఘ నాయకులకు కూడా ఆహ్వానం రావటంతో చిరంజీవి కూడా వస్తారనే ప్రచారం బాపట్ల పరిసర ప్రాంతాలలో చర్చనీయాంశంగా మారింది. అయితే అధికారులు దీనిని ధ్రువీకరించలేదు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ ఆరాధన

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన సీబీజెడ్ చర్చిలో ఆదివారం 9వ వార్షిక ఆలయ ప్రతిష్ఠ ఆరాధన, కోతకాలపు పండుగ చేశారు. ఈ సందర్భంగా స్త్రీల సమాజం వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సంఘకాపరి ఎం.పవిత్రకుమార్, సెక్రటరి జె.క్రిష్టాఫర్ ప్రార్థనలు చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్‌సి సజీవన్ వాక్యోపదేశం అందించారు. ఆలయ ప్రాముఖ్యతను, దేవుని మందిరం గురించి వివరించారు. ఏసుప్రభువు ప్రజల కోసం ఈ లోకంలో జన్మించారని తెలిపారు. ఆయనను విశ్వసించి రక్షించబడిన వారిని సంఘ సహవాసంలోకి చేర్చుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ మాణిక్యారావు, జి.డేవిడ్ లివింగ్‌స్టన్, పాస్టర్ రాహుల్‌దేవ్, కేజేవీ సుభకర్ పాల్గొన్నారు.



స్టాల్ ప్రారంభిస్తున్న సంఘకాపరి ఎం.పవిత్రకుమార్, చర్చి కార్యదర్శి జె.క్రిష్టాఫర్

శ్రీ అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణం తవ్వ కాల్వ సమీపంలోని శ్రీరాజ్యలక్ష్మి నగర్ మెయిన్ రోడ్డులో కాలనీవాసుల ఆధ్వర్యంలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 8న నిర్వహించగా ఆదివారం 16 రోజులు పూర్తయిన సందర్భంగా స్వామివారికి ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ అభయాంజనేయస్వామి వారికి గోపూజతో మొదలై పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక పూజలు నిర్వహించారు. కాలనీవాసులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

● అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు తెలిపారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల జిల్లా మహాసభ ఆదివారం బాపట్లలోని సూర్యకాళీ ఫంక్షన్ ప్లాజాలో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్ అధ్యక్షత వహించగా రాజశేఖర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించటంతో పాటు మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రకాష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. యూటీఎఫ్ 50 సంవత్సరాల స్వర్ణోత్సవ సభలు జనవరి 5, 6, 7, 8 తేదీలలో జరుగుతాయని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు కోలాట ప్రదర్శనతో భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండా, యూటీఎఫ్, ఎస్‌టీఎఫ్ఐ జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.పురుషోత్తం, సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, యాజలి భాస్కరరావు, శైలజ, నాంచారయ్య, జన విజ్ఞాన కేంద్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు ఉపాధ్యాయుల సమస్యలపై ప్రసంగించారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా వినయ్‌కుమార్



జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక సూర్యకాళీ ఫంక్షన్ ప్లాజాలో నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా పి.పాపారావు, అధ్యక్షుడిగా జడ వినయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బిక్షాలుబాబు, ఆర్.హరిప్రియ, ప్రధాన కార్యదర్శిగా ఎ.శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎస్.వెంకటేశ్వర్లరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా జిల్లా కార్యదర్శులుగా కె.రవిబాబు, యు.చెంచయ్య, వి.విజయలక్ష్మి, ఎంవీబీ సుబ్రహ్మణ్యం, పి.సురేష్, పి.రామాంజనేయులు, ఎం.సురేష్, ఆర్.పద్మావతి, కేవీఎస్ఎన్ కోటేశ్వరరావు, బి.వినోద్‌బాబులను ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిలర్‌లుగా ఎస్‌డి హబీబ్, సీహెచ్ బాపయ్య, బి.శ్రీనివాసరెడ్డి, జి.రాజకుమారి, ఆడిట్ కమిటీ సభ్యులు టి.సుబ్బారావు, వలిఖాన్, పి.సీతారామరాజు, ఎయిడెడ్ కన్వీనర్‌గా కె.శ్రీనివాసరావు, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా సీహెచ్ హనుమంతరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

అమృతలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఇబ్బంది పడి చికిత్స చేయించుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులను ఆదివారం అందజేశారు. మండలంలోని పాంచాళవరం గ్రామానికి చెందిన బొడ్డు లక్ష్మీ తిరుపతమ్మ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ప్రైవేటు వైద్యశాలలో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబసభ్యులకు రూ.61,679, మోపర్రు గ్రామానికి చెందిన గోగినేని సాంబశివరావు అనారోగ్యంతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందారు. ఈ సందర్భంగా చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.37,205 చెక్కును, ఇంటూరు గ్రామానికి చెందిన కొపూరి నీలాంబరం అనారోగ్య సమస్యలతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందారు. చికిత్స పొందిన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయం ఆర్థీ అందజేయగా రూ.లక్షా 16 వేల 656 చెక్కును ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. వీరికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తన క్యాంపు కార్యాలయంలో చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పావులూరి హేమచంద్, కాట్రగడ్డ లక్ష్మీప్రసాద్, సుబ్బయ్య ఉన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దుండిపాలెంకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వట్టిప్రోలు మోహనరావు కుమారుడు ప్రసన్నకుమార్ (37) ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదివారం సాయంత్రం గ్రామానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యకలాపాలలో ప్రసన్నకుమార్ ఉత్సాహంగా పాల్గొనే వాడని గుర్తు చేసుకున్నారు. ఆనందబాబు వెంట బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, పిట్టు వెంకటరెడ్డి, అక్కల కోటిరెడ్డి, ఎంపీటీసీ నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవచింతన పెంపొందించేందుకు వేదాలు దోహదం



వేద విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వేదాలు హిందూ ధర్మాన్ని రక్షించటంతోపాటు దైవచింతన పెంపొందించేందుకు దోహదపడుతాయని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నగరం మండలం చిన్నమట్లపూడి పంచాయతీ మృత్యుంజయవారిపాలెం గ్రామంలో శ్రీకాణ్వయ శుక్ల యజుర్వేద స్మార్త పాఠశాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదపండితులు నిర్వహించిన యజ్ఞహోమ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలోని మృత్యుంజయవారిపాలెంలో వేద పాఠశాల ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. తద్వారా వేదాలు నేర్చుకునేందుకు దోహదపడుతుందన్నారు. పాఠశాలకు కావాల్సిన వసతులకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సహాయ సహకారాలు ఉంటాయని హామీనిచ్చారు. ప్రస్తుతం వేదవృత్తిపై కొంతమక్కువ తగ్గిందని ఇప్పుడిప్పుడే వేదంపై చిన్నారులు మక్కువ చూపుతున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వేదాలను నేర్పిస్తే దేశం సుఖసంతోషాలతో ఉంటుందని వేదం ద్వారా హిందూత్వాన్ని పెంపొందించటంతో పాటు వేదపండితులుగా తయారై పలువురికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లుక్కా గుడారంకయ్య, అబ్దుల్ మునాఫ్, వేద అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరు

నగరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీలో తర్ఫీదు పొందిన విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటారని ఎస్వీఆర్ఎం కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి అన్నారు. కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదానం, స్వచ్ఛభారత్, చెట్ల పెంపకం వంటి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ సేవాతత్పరంతో ముందుకు వెళుతూ నాయకత్వ లక్షణాలను పొందించుకుంటున్నారన్నారు. ఎన్‌సీసీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ర్యాంక్‌లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ అమరేష్‌రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ వి.సాంబమూర్తి, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సవాల్‌గా అనధికార లేఅవుట్లు

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది
- వాటిని పీకేస్తున్న అక్రమార్కులు



అక్కాయిపాలెం పరిధిలో జాతీయ రహదారి పక్కన వేసిన అనధికారిక లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డ్.. బోర్డును పీకేసిన అక్రమార్కులు

చీరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్లు సంబంధిత అధికారులకు సవాల్‌గా నిలుస్తున్నాయి. అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసినవారికి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో ఒకసారి ప్లాట్లు కొనుగోలు చేసిన తరువత తమకెలాంటి సంబంధం లేదని విక్రయదారులు చెప్తున్నారు. దీంతో కొనుగోలుదారులు నష్టపోతున్నామని, అందుకు సంబంధించి తమకు న్యాయం చేయాలని కొనుగోలుదారులు కోరుతున్నారు. అనధికారిక లేఅవుట్లలో పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా లేఅవుట్లలో కొనుగోలు చేసిన వారికి కనీసం భవన నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వమని ఆ హెచ్చరిక బోర్డులలో పొందుపరుస్తున్నారు.

చీరాల నియోజకవర్గంలో అనధికారిక లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇవి అందరికీ కనిపిస్తాయి. అయితే సంబంధిత అధికారులకు మాత్రం కనిపించవు. అందిన ఫిర్యాదులు, మీడియాలో ప్రచురితమైన కథనాలతో ఆ లేఅవుట్లపై అధికారులు చేపడుతున్న చర్యలు మొక్కుబడిగా ఉంటున్నాయి. చీరాల నియోజకవర్గ పరిధిలో వెలుస్తున్న అనధికారిక లేఅవుట్లు, ఒకరిని చూచి మరొకరు అదే పంథాలో రియల్ దందా సాగిస్తుండడం అందుకు నిదర్శనం. అధికారులు వారికి కొమ్ముకాస్తుండడమే ప్రధాన కారణమనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

కన్వర్షన్ రుసుం చెల్లించకుండానే లేఅవుట్లు

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర పనులకు వినియోగించే క్రమంలో కన్వర్షన్ (నాళా రుసుం) ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే పుట్టగొడుగుల్లా వెలుస్తున్న లేఅవుట్లలో సింహభాగం కన్వర్షన్ రుసుము చెల్లించకుండా విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు. అలాంటి వాటిపై రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. అలాంటి చోట్ల పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం గుడ్డిలో మెల్లగా ఉందని చెప్పుకుంటున్నారు.

ఏర్పాటు చేసిన కొద్ది సేపటికే బోర్డులు మాయం

కన్వర్షన్ ఫీజు చెల్లించకుండా వేస్తున్న లేఅవుట్లను ప్రాథమికంగా అడ్డుకోవల్సిన బాధ్యత రెవెన్యూ శాఖది. అయితే వారు ఆ పని చేయడం లేదు. అందుకు పలు రకాల కారణాలు ఉన్నాయని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు అనధికారిక లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. వేసిన కొద్ది సేపటికే అక్రమార్కులు హెచ్చరిక బోర్డులను తొలగించి పడేస్తున్నారు. దీనిపై కఠిన చర్యలకు ఉన్నతాధికారులు తగిన నిర్ణయం తీసుకోవాల్సిందే.



తీపి కబుర్లు.. చేదు చేష్టలు

ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలో సిండికేట్‌గా అనధికారిక లేఅవుట్లు వేస్తున్న వారిలో ఓ వ్యక్తి కీలకపాత్ర పోషిస్తున్నాడు. తీపి కబుర్లు చెప్తూ, చేదు చేష్టలతో అక్రమ ప్లాట్లను విక్రయిస్తున్నాడు. రెవెన్యూ అధికారుల ఆశీర్వచనాలు అతనికి ఉంటున్నాయని పలువురు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోలేరమ్మకు వెండి కిరీటం బహూకరణ



అమ్మవారికి హుండీ, వెండి కిరీటాన్ని బహూకరించిన దాతలు

యద్దనపూడి (మార్టూరు,) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడిలోని పోలేరమ్మ తల్లి దేవ స్థానానికి ఆదివారం దాతలు వెండి కిరీటాన్ని, హుండీని బహూకరించినట్లు భూషయ్య తెలిపారు. తుర్లపాడు గ్రామానికి చెందిన నల్లపాటి సతీష్, భానుప్రియ దంపతులు రూ.10,500 విలువైన హుండీని బహూకరించారు. అదే విధంగా గొట్టిపాటి శేషగిరిరావుతో పాటు వారి కుమార్తె, అల్లుడు శ్రీనివాసరావు, హనుమంతరావు దంపతులు రూ.76 వేల విలువైన వెండి కిరీటాన్ని అమ్మవారికి బహూకరించగా అర్చకులు అమ్మవారికి అలంకరించారు.

ఘనంగా కార్తీక వన సమారాధనలు

ఉత్సాహంగా పాల్గొన్న ఆయా సామాజిక వర్గాల ప్రముఖులు



బ్రాహ్మణ వన సమారాధనలో భానును సత్కరిస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో ఆదివారం పలు చోట్ల నిర్వహించిన వన సమారాధన కార్యక్రమాల్లో ఆయా సామాజిక వర్గాల ప్రముఖులు, కుటుంబాల ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈక్రమంలో స్వర్ణ రోడ్డులోని దత్త క్షేత్రంలో బ్రాహ్మణ సమారాధన నిర్వహించారు. దీంతో ఈశ్వరునికి, విష్ణుదేవునికి ప్రీతికరమైన ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, నందికేశుని నోము ఘనంగా జరిపారు. ఆయా సామాజిక వర్గానికి చెందిన పవని భానుచంద్రమూర్తి, గోనెళ్ల శేషవరలక్ష్మి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డును అందుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. వారిని ఘనంగా సత్కారించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మవరపు వెంకట రమణ, సత్యనారాయణమూర్తి, సీతామహాలక్ష్మీ, వడలి రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆకురాతి వారి ఆధ్వర్యంలో

ఈపూరుపాలెం పంచాయతీ సావరపాలెంలోని శ్రీ సైకిత లింగేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో ఆకురాతి వంశస్థులు ఘనంగా 13వ కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈక్రమంలో ముందుగా ఈపూరుపాలెం కూరగాయల మార్కెట్ వద్ద ఆకురాతి రంగనాయకులు స్వామి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ఆకురాతి వంశస్థులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం



చిన్నారులకు బహుమతులను అందజేస్తున్న లక్ష్మీనరసింహశాస్త్రి

పర్చూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు శనగవరపు లక్ష్మీనరసింహశాస్త్రి అన్నారు. స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ కార్యక్రమంలో చిన్నారులకు వ్యక్తిత్వ వికాశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ అంశాలపై చిన్నారులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా ఎంతగానో దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో కఠారి సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, అజయ్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి పడి పూజ

బల్లికురవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దామావారిపాలెంలో కార్తీక సోమవారం సందర్భంగా సోమవారం రాత్రి అయ్యప్ప స్వామి అభిషేకం, పడి పూజ జరుగుతుందని 19వ వార్డు కౌన్సిలర్ ఏజెండ్ల నాగరాజు తెలిపారు.

నేడు బల్లికురవలో అర్జీల స్వీకరణ

బల్లికురవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం బల్లికురవలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అర్జీలను స్వీకరించనున్నారు. మండలంలోని ప్రజలు అర్జీలను సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవాలని మంత్రి కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో తెలపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకిన బాలుడు.. తప్పిన ప్రమాదం

తోటవారిపాలెం(చీరాలటౌన్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం తోటవారి పాలెం పంచాయతీ ఇందిరా కాలనీలో ఆరేళ్ల బాలుడు ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకున్నాడు. అయితే స్వల్ప గాయాలతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే ఈపూరుపాలెం జెండా చెట్టు సమీపానికి చెందిన ఆరేళ్ల బాలుడు ఆదివారం స్కూల్‌కు సెలవు కావడంతో అమ్మమ్మ వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో బాబు ఆడుకుంటుండగా అందరూ ఆదమరిచారు. ప్రమాదాన్ని గ్రహించని బాలుడు సమీపంలో ట్రాన్స్‌పార్మర్‌కు ఆనుకుని ఉన్న రాళ్లపైకి ఎక్కి తీగలను పట్టుకున్నాడు. దీంతో చేతికి ఒక్కసారిగా కరెంట్ సరఫరా జరిగి కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు చీరాల్లోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్సను అందించారు. కొద్దిసేపటికి స్పృహలోకి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బంది ట్రాన్స్‌పార్మర్‌కు ఆనుకుని వేసిన రాళ్లను తొలగించారు. అలాగే చుట్టూ రక్షణ చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

అలరించిన సత్యహరిశ్చంద్ర

- రాత్రంతా కదలకుండా తిలకించిన అభిమానులు
- అద్దంకిలో చెక్కుచెదరని పౌరాణిక నాటక అభిమానం



రీడింగ్ రూం ఆవరణలో ప్రదర్శిస్తున్న సత్యహరిశ్చంద్ర నాటకం



నాటకానికి హాజరైన ప్రేక్షకులు

అద్దంకి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు వినోదానికి పెట్టింది పేరుగా ఉన్న పౌరాణిక నాటకాలు చిత్ర పరిశ్రమ రాకతో క్రమేపీ ప్రాభవం తగ్గుతూ వచ్చాయి. నేటి తరం యువతకు పౌరాణిక నాటకాలు అంటే పుస్తకాలలో మాత్రమే చదువుకునే పరిస్థితి. దీంతో పౌరాణిక కళాకారులు కూడా పూర్తిగా తగ్గిపోయారు. అద్దంకి మాత్రం పౌరాణిక కళాకారులకు పెట్టింది పేరు. నాటి తరం కళాకారులతో పాటు నేటి తరంలో కూడా కొద్దిమంది అప్పుడప్పుడూ పౌరాణిక కళా ప్రదర్శనలు ఇస్తూ ప్రజలను రంజింప చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో రీడింగ్ రూమ్ ఆవరణలో డోలక్ ఆర్టిస్ట్ కొమరిగిరి హనుమంతరావు సంతాప సభలో భాగంగా అద్దంకి పట్టణ రంగస్థల కళాకారుల ఆధ్వర్యంలో సత్యహరిశ్చంద్ర (వారణాసి సీను), దేవనర్తకి పూర్తి నాటకం ప్రదర్శన జరిగింది. పౌరాణిక నాటకాల ప్రదర్శన ఆదివారం తెల్లవారే వరకు జరిగినా అభిమానులు కదలకుండా ఉండడం విశేషం. దీనిని బట్టి అద్దంకిలో పౌరాణిక నాటకాల పట్ల అభిమానుల ఆదరణ కొనసాగుతూనే ఉందనటానికి నిదర్శనంగా నిలిచింది. అదే సమయంలో ఇటీవల వరకు చెత్తాచెదారంతో నిండి ఉన్న రీడింగ్ రూమ్ ప్రాంగణం పౌరాణిక నాటకాల ప్రదర్శన పుణ్యాన బాగుపడింది. రంగస్థల కళాకారుడు ఆలకుంట శ్రీనివాసరావు, జన చైతన్య వేదిక కన్వీనర్ అన్నమనేని వెంకటరావు, మన్నం త్రిమూర్తులు, పమిడిఘంటం చంద్రశేఖర్, దామా హనుమంతరావు, వీసీ హెచ్ కోటయ్య, తన్నీరు నాగేశ్వర రావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, వెలనాటి రామారావు హాజరయ్యారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి



అద్దంకిలోని దత్తపాదుకాక్షేత్రంలో పూజలు చేస్తున్న మంత్రి గొట్టిపాటి

అద్దంకి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల వేగవంతానికి కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలో పలు కార్యక్రమాల్లో మంత్రి ఆదివారం పాల్గొన్నారు. ముందుగా దత్తపాదుకా క్షేత్రంలో ఆదివారం మంత్రి గొట్టిపాటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సూర్య గార్డెన్, ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. మండలంలోని శింగరకొండపాలెంలో టీడీపీ నేత మానం వీరాంజనేయులు ఇటీవల మృతి చెందగా రవికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. పట్టణంలో రీడింగ్ రూమ్ (ఎర్రన కళాక్షేత్రం) అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రంగస్థల కళాకారులు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని వేలమూరిపాడు రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో వసతులు కల్పించాలని, మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, చాగంటి రాజేంద్రప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, దత్, వైస్ చైర్మన్ దేసు పద్మేష్, చిన్ని శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు అత్తులూరి రమేష్, విజయలక్ష్మి, మాదవరావు, లహరి, కుందారపు రామారావు, కాకాని అశోక్, తమ్మన శ్రీనివాస రావు, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, మామిడి రాం బాబు, భోజనపల్లి సత్యనారాయణ, చామర్తి మల్లికార్జునరావు, కురిచేటి చిన్ని పాల్గొన్నారు.

అన్నమయ్య ఖ్యాతిని ఊరూరా చాటాలి

విజయ శంకరస్వామి



హిందూ ధర్మం ఆవశ్యకతను వివరిస్తున్న విజయశంకరస్వామి

పర్చూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రియ భక్తుడు, పరమ భాగవతోత్తముడు అన్నమయ్య ఖ్యాతిని ఊరూరాచాటాలని తిరుపతిలోని అన్నమయ్య కళా క్షేత్రం ప్రతినిధి విజయ శంకరస్వామి అన్నారు. పర్చూరులోని శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండప ప్రాంగణంలో అన్నమయ్య సంకీర్తన భజన మండలి సనాతన ధర్మం అవస్యకత, హిందూ ధర్మం అనే అంశంపై కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన విజయ శంకరస్వామి మాట్లాడుతూ హిందూ ధర్మం నిలవాలని, సనాతన ధర్మం గొప్పతనాన్ని గ్రామ గ్రామాన చాటేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవస్యకత ఎంతైనా ఉందన్నారు. హిందూ సంస్కృతి సంప్రదాయాల గొప్పతనాన్ని ఆయన కొనియాడారు. తిరుపతిలో ఏర్పాటు చేసిన అన్నమయ్య కళాక్షేత్రం పనరంకిత ఉత్సవాలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామారావు, సామ్రాజ్యం, బీ లత పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఆర్వో



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

పర్చూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను బాపట్ల డీఆర్వో గంగాధర్ గౌడ్ ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీపీయూపీ పాఠశాలలోని 140 నుంచి 144 పోలింగ్ బూత్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, బిరుదు నాగేశ్వరావు, బీఎల్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : మండలంలోని కడవకుదురు, చినగంజాం, సోపిరాల గ్రామాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జె.ప్రభాకరరావు ఆదివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు నమోదు, తొలగింపులు, సవరణల నిమిత్తం ప్రత్యేక శిబిరాలను నిర్వహించినట్లు తహసీల్దార్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా అందుబాటులో ఉంచాలని బూత్ లెవల్ అధికారులకు సూచించారు. ఓటరు జాబితాలో ఒకే కుటుంబానికి చెందిన ఓట్లన్నీ ఒకే కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఫొటోలు, పేర్లు, చిరునామాలు, వయస్సు సక్రమం గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. 18 ఏళ్లు ఉన్న వారందరికీ ఓటు ఉండేలా కృషి చేయాలని బీఎల్వోలను తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకులు

సోపిరాలలో అన్నదానం

చినగంజాం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లోని జనసేన పార్టీ మండల కార్యాలయంలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం మండల పార్టీ ఆధ్వర్యంలో నాయకులు నిర్వహించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో పర్చూరుకు చెందిన ఎన్నారై, జనసేన నాయకులు మన్నెం శ్రీకాంత్ పర్చూరు నియోజకవర్గంలో ప్రతివారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు నందు శ్రీనివాసరావు తెలిపారు. 11 వారాలుగా కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతున్నట్లు చెప్పారు. ఇది 12వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కట్టెబోయిన సుబ్బారావు, గంటా వెంకటేష్, బీ శ్రీను, కుర్రి వాసు, సాయి, వెంకటేష్, గోపీనాథ్, పవన్, ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రోగ్రామ్స్ కమిటీ కార్యదర్శి సతీష్, బీజేపీ సీనియర్ నాయకుడు కోటయ్య, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

29న శింగరకొండలో కార్తీక దీపోత్సవం

బల్లికురవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలకు కార్తీక దీపోత్సవం జరుగుతుందని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. 108 మంది దంపతులు పాల్గొనే అవకాశం ఉందని, పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ప్రత్యేక పారిశుధ్య పనులు

ఇంకొల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పంచాయతీ పరిధిలోని ఇంకొల్లు, గొల్లపాలెం, హనుమోజీపాలెం గ్రామాలలో సోమవారం నుంచి వారం రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య పనులు చేయనున్నట్లు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. చెరువు, రోడ్ల వెంబడి ఉన్న వ్యర్థాలను, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపడతారని తెలిపారు.

నేడు శింగరకొండలో కార్తీక వనభోజనాలు

బల్లికురవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలోని కోదండరామాలయం (రామాలయం)లో కార్తీక వనభోజనాలు కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని శ్రీరామవృద్ధుల ఆశ్రమం అధ్యక్షుడు రావూరి రంగయ్య తెలిపారు. ముఖ్యఅతిథిగా కామేపల్లి గ్రానైట్స్ అధినేత కామేపల్లి లక్ష్మీ ప్రసాద్ హాజరవుతారని తెలిపారు.

బైబిల్ పరీక్షకు 40 మంది హాజరు



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న కేంద్ర జీఎస్టీ ఇన్‌స్పెక్టర్

చినగంజాం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లోని పెద్ద చర్చి వద్ద అంబేద్కర్‌నగర్ పెద్దలు, ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బైబిల్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 40 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు మేకల మేషక్‌బాబు తెలిపారు. బైబిల్ ప్రశ్న పత్రాలను కేంద్ర జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ మేడికొండ సూరిబాబు ఆవిష్కరించినట్లు తెలిపారు. ఇన్విజిలేటర్‌గా గేరా ఆషా వ్యవహరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు, యూత్ సభ్యులు మల్లేశ్వరరావు, బడుగు విజయ్, మార్పు జాకబ్‌రాజు పాల్గొన్నారు

అగ్ని ప్రమాదం.. రూ.2లక్షల ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అద్దంకి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదం చోటు చేసకొని సుమారు 2 లక్షల రూపాయల ఆస్తినష్టం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో కొత్తదామావారిపాలెం సమీపంలో షేక్ షాజహాన్ పాత సామానుల దుకాణం నిర్వహిస్తున్నారు. దుకాణం వద్ద వెల్డింగ్ మిషన్‌తో కటింగ్ చేస్తుండగా రవ్వలు సమీపంలో ఉన్న అట్టలపై పడడంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక యంత్రం ద్వారా మంటలను ఆర్పారు. సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

12 మద్యం సీసాలు పట్టివేత

చీరాలటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు మండల పరిధిలోని జాండ్రపేట గ్రామంలో పలు చోట్ల దాడులు నిర్వహించి వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు.

ప్రసవ వేదనతో తల్లడిల్లిన గోమాత

- పొట్ట ప్లాస్టిక్‌తో నిండి ఉండడంతో అప్పటికే మృతి చెందిన దూడ
- సపర్యలు చేసిన స్థానికులు

చీరాలటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నోరులేని గోమాత ప్రసవ వేదనతో తల్లడిల్లింది. అయితే చుట్టుపక్కల వారు నానా తంటాలు పడి కాన్పు చేయగా పొట్టలోని చిన్న గోమాత అప్పటికే మృతి చెంది ఉండడంతో పలువురి హృదయాలను కలచి వేసింది. ఈ ఘటన చీరాల పరిధిలోని పట్టాభి స్వీట్స్ సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నెలలు నిండిన గోమాత రోడ్డుపై కుప్పకూలి ప్రసవ నొప్పులు పడుతోంది. దీంతో సమాచారం అందుకున్న గో పరిరక్షణ ప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకుని కాన్పు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో వారు ప్రభుత్వ పశు వైద్యులు డా.చిట్టిబాబుకు సమాచారం చేర వేశారు. దీంతో ఆయన ప్రజల సహకారంతో పొట్టలోనే మృత్యువాత పడిన చిన్న గోమాతకు కాన్పుచేశారు. అంతే కాకుండా పొట్ట నిండా ప్లాస్టిక్‌తో నిండి ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. పొట్టను శుభ్ర పరచి వైద్యం అందించారు. ఈసందర్భంగా గో పరిరక్షణ ప్రతినిధులు మాట్లాడుతూ యజమానులు జీవాలను రోడ్డుపైకి వదల రాదని కోరారు. తద్వారా వాటికి ప్రాణాపాయం పొంచి ఉన్నట్లు వివరించారు. మునిసిపల్ అధికారులు ఇటువంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో డా. శబరి, ప్రతినిధులు నాయన రమణారెడ్డి, పులి సాంబశివరావు, పెనుగొండ శ్రీనివాసరావు, పదవ తరగతి విద్యార్థి ప్రవీణ్, రామ మందిరం వెనుక బజార్ మహిళలు పాల్గొన్నారు.